RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



3 లో పెట్రోలు బంక్ డీలర్ల మార్జిన్‌ను 5 శాతానికి పెంచాలి

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :243 సంపాదకులు: కలిచేటి వెంకయ్య బుధవారం 29 జులై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల ద్వారా ఏపీకి రూ. 25.48 కోట్లు

పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

రాష్ట్రంలో 22 జిల్లాలను కవర్ చేస్తున్న 24 ఆర్‌ఎస్ ఈ టి ఐ కేంద్రాలు

మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు



**ఢిల్లీ సింధూరదర్శిని:** గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల పనితీరు, ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసిన నిధులు, గ్రామీణ యువతకు అందిస్తున్న శిక్షణ, స్వయం ఉపాధి కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో లిఖితపూర్వకంగా ప్రశ్నలు అడిగారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ మంగళ వారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా గ్రామీణ యువతకు పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, మిగతా 2లో...

## నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు

విద్యార్థుల ఆందోళనలపై సుప్రీం కీలక ఆదేశాలు

విద్యార్థుల ఆందోళనలపై సిట్ కు దిశానిర్దేశం

అదుపులో ఉన్న మైనర్లను విడుదలచేయాలని ఆదేశం

ఎలక్ట్రానిక్ ఆధారాలు భద్రపరచాలని సూచన

కేంద్రం, ఏడు రాష్ట్రాలకు నోటీసులు

కేసు విచారణ వచ్చే వారానికి వాయిదా



**న్యూఢిల్లీ:**నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పోలీసుల బలప్రయోగం, పోలీసులపై జరిగిన దాడులపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. ఈ వ్యవహారంపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు మిగతా 2లో...

## జనసంద్రమైన సింహాచలం..

వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ

ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం

అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం

10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా

భక్తుల కోసం భారీ ఏర్పాట్లు..

డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ



**సింహాచలం, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని మిగతా 2లో...

## అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా

దేశంలోనే మొదటి ప్రెసిషన్ అంకాలజీ పరిశోధనకు ఒప్పందం

సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ



**అమరావతి, సింధూరదర్శిని:** కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేం దుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ– ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రాజెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో మిగతా 2లో...




## పీఓకే ఎన్నికలు...

### పాకిస్థాన్‌పై భారత్ ఘాటు విమర్శ

పీఓకే ఎన్నికలు కంటితుడుపు చర్యేనన్న భారత్

అక్రమ ఆక్రమణను కప్పిపుచ్చుకునేందుకే ఈ నాటకం

జమ్ముకశ్మీర్, లడక్ భారత్‌లో అంతర్భాగమని పునరుద్ఘాటన

తొలి దశ పోలింగ్‌లో రిగ్గింగ్ జరిగిందని పీపీపీ ఆరోపణలు

**న్యూఢిల్లీ:**పాక్ ఆక్రమిత జమ్ముకశ్మీర్ (పీఓకే)లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు కేవలం కంటితుడుపు చర్యేనని భారత్ మంగళ వారం తీవ్రంగా స్పందించింది. తన ఆక్రమణను, ఆ ప్రాంతంలో జరుగుతున్న తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలను కప్పిపుచ్చుకునేందుకే పాకిస్థాన్ ఈఎన్నికల ప్రహసనాన్ని కొనసాగిస్తోందని విమర్శించింది. మిగతా 2లో...

## చౌక డిపోల్లో స్టీమ్ రైస్ పంపిణీ

దేశంలోనే తొలిసారి కాకినాడ జిల్లాలో అమలు – పైలెట్ ప్రాజెక్టుగా 9 వేల మెట్రిక్ టన్నులు ప్రతి నెలా అందజేత

ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి విశాఖ జిల్లాల్లో డిజిటల్ వాలెట్‌కు శ్రీకారం


త్వరలో చౌక డిపోల ద్వారా కందిపప్పు అందిస్తాం – తక్కువ ధరకే 70 సరకులతో 1000 మీ మార్టులు

ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు

బాయిల్ట్ రైస్ ధాన్యం సేకరణ కోటా మరో 20 వేల మెట్రిక్ టన్నుల పెంపు

రూ.281 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

రెండు రోజుల ఢిల్లీ పర్యటన అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్



**న్యూఢిల్లీ:**'చౌకధరల డిపో ద్వారా అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ప్రజలు ఎందుకు పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు..? ప్రతి కేజీ మీద రూ.56 మేర రాయితీని వెచ్చిస్తుంటే ఆ బియ్యం ప్రజలకు ఎందుకు అక్కరకు రాకుండాపోతున్నాయి..? అనే విషయం మీద రాష్ట్ర పౌర సరఫరాల శాఖ లోతుగా అధ్యయనం చేసింది. నిపుణులు, ఆర్థికవేత్తలు, ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్న తర్వాత ప్రజా పంపిణీలో ఇప్పుడు అందిస్తున్న బియ్యం స్థానంలో, ప్రజలు ఆసక్తి చూపిస్తున్న స్టీమ్ రైస్ అందిస్తే వినియోగం పెరుగుతుందని మిగతా 2లో...

## డీఎస్సీ అవకతవకలకు ఆస్కారమే లేదు

**అమరావతి, సింధూరదర్శిని:** మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక పరీక్షల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలను ఏపీలోని కూటమి ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీ చర్యలతో పరీక్షలు నిర్వహించామని స్పష్టం చేసింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని, అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

**లీక్‌కు ఆస్కారం లేని భద్రతా వ్యవస్థ**

పరీక్షల నిర్వహణలో అనుసరించిన పటిష్ఠమైన భద్రతా విధానాలను ప్రభుత్వం వెల్లడించింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన టీసీఎస్ అయాన్ ప్లాట్‌ఫామ్‌ను ఈ పరీక్షల కోసం వినియోగించినట్టు తెలిపింది. సమాచార భద్రతకు అత్యున్నత ప్రామాణికమైన 256-బిట్ ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీతో ప్రశ్నపత్రాలను భద్రపరిచామని, దీనివల్ల డేటా లీక్ అయ్యే అవకాశమే లేదని స్పష్టం చేసింది. పరీక్ష రాసే ప్రతి అభ్యర్థికి 42 లక్షల ప్రశ్నల భారీ బ్యాంక్ నుంచి కంప్యూటర్ మిగతా 2లో...




అత్యాధునిక భద్రతపై ఏపీ ప్రభుత్వం వివరణ ఇదిగో!

ఏపీ మెగా డీస్సీ-2025పై ఆరోపణలు

వివరణ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులకు గాను 15,941 మందికి నియామక పత్రాలు జారీ

టీసీఎస్ ఐయాన్ ప్లాట్‌ఫామ్‌పై పటిష్ఠ భద్రతతో కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ

ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం, పారదర్శకతకు పెద్దపీట

రాష్ట్ర చరిత్రలోనే అత్యంత వేగవంతమైన, పారదర్శక నియామక ప్రక్రియగా వెల్లడి

## నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

బృందం (సిట్) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అలాగే నేర చరిత్ర లేని విద్యార్థి నిరసనకారులపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిటిషనర్ల ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరాన్ని సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశంపై కేంద్రంతో పాటు అసోం, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఆందోళనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న మైనర్లను వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం నిరసనల్లో పాల్గొన్నారనే కారణంతో అరెస్టు చేసిన లేదా అదుపులో ఉంచిన విద్యార్థులకు నేర చరిత్ర లేకపోతే వారిని కూడా విడుదల చేయాలని స్పష్టం చేసింది. అయితే క్రిమినల్ నేపథ్యం ఉన్న వారికి ఈ రక్షణ వర్తించదని పేర్కొంది. ఆందోళనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, డ్రోన్ వీడియోలు, బాడీ కెమెరా రికార్డింగులు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ వివరాలు, పీసీఆర్ లాగ్‌లు సహా అన్ని ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటాను కూడా భద్రపరచాలని, అయితే ప్రస్తుతానికి వాటిని బహిర్గతం చేయవద్దని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా, పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులపైనా సమగ్ర దర్యాప్తు అవసరమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. సుమారు 250 మంది పోలీసులకు కూడా గాయాలయ్యాయని తెలిపారు. నిరసనల్లో సంఘవిద్రోహ శక్తులు చొరబడి ఉండే అవకాశం ఉందని, నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది.

## జనసంద్రమైన సింహాచలం..

(మొదటిపేజీ తరువాయి)

ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది.కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగు నీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తిచేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారిఆలయానికి చేరుకుంటారు. ఆషాఢపౌర్ణమి నాడు సింహాద్రికొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూప్రదక్షిణ చేసినంత పుణ్యఫలందక్కుతుందని భక్తులుప్రగాఢంగా విశ్వసిస్తారు.

## గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల ద్వారా ఏపీకి రూ. 25.48 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)



ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

**ఆంధ్రప్రదేశ్‌కు రూ. 25.48 కోట్లు**

కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, అనేది ఒక డిమాండ్ ఆధారిత పథకం. రాష్ట్రాలు సమర్పించే రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన కేంద్రం నిధులను విడుదల చేస్తుంది. 2022-23లో, 2021-22 బకాయిలతో కలిపి ఏపీకి రూ. 15.66 కోట్లు విడుదలయ్యాయి. 2023-24లో, రూ. 15.66 కోట్లు విడుదల చేశారు. 2026-27లో (జులై 24 నాటికి), 2023-24, 2024-25 సంవత్సరాల క్లెయిమ్‌లకు సంబంధించి రూ. 25.48 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లు అందాల్సి ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.

**ఏపీలో 22 జిల్లాల్లో 24 కేంద్రాలు**

రాష్ట్రంలో మొత్తం 28 జిల్లాలకు గాను ప్రస్తుతం 22 జిల్లాలను కవర్ చేస్తూ 24కేంద్రాలు విజయవంతంగా పనిచేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026-27) నిధులు విడుదలైన 13 జిల్లాల వివరాలను పరిశీలిస్తే.. విజయనగరం జిల్లాకు రూ. 4.81 కోట్లు, కృష్ణా జిల్లాకు రూ. 2.66 కోట్లు, చిత్తూరు జిల్లాకు రూ. 2.56 కోట్లు, శ్రీకాకుళం జిల్లాకు రూ. 1.96 కోట్లు, ప్రకాశం జిల్లాకు రూ. 1.93 కోట్లు, అనంతపురం జిల్లాకు రూ. 1.71 కోట్లు, ఏలూరు జిల్లాకు రూ. 1.70 కోట్లు, విశాఖపట్నం జిల్లాకు రూ. 1.57 కోట్లు, వైఎస్సార్ కడప జిల్లాకు రూ. 1.50 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాకు రూ. 1.49 కోట్లు, నెల్లూరు జిల్లాకు రూ. 1.27 కోట్లు, గుంటూరు జిల్లాకు రూ. 1.20 కోట్లు, కర్నూలు జిల్లాకు రూ. 1.06 కోట్లు కేటాయించి విడుదల చేసినట్లు తెలిపారు.

**బలహీన వర్గాలు , మహిళలకు ప్రాధాన్యం**

గ్రామీణ పేద యువతను గుర్తించడంలో రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్లు , స్వయం సహాయక సంఘాలు భాగస్వామ్యం తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, ఎస్సీ , ఎస్టీ , ఓబీసీ ఇతర బలహీన వర్గాలకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు కేవలం సర్టిఫికెట్‌కే పరిమితం కాకుండా, సొంతంగా ఉపాధి యూనిట్లను నెలకొల్పేందుకు బ్యాంకుల ద్వారా క్రెడిట్ లింకేజీ (రుణ సదుపాయం) కల్పిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తయిన తర్వాత కూడా అభ్యర్థులకు మెంటార్‌షిప్, కౌన్సెలింగ్, వ్యాపారాభివృద్ధి సేవలు అందిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# చౌక డిపోల్లో స్టీమ్ రైస్ పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించామ'ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దీనివల్ల ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం అవుతుందని, బియ్యం పక్కదారి పట్టడం తగ్గుతుందని చెప్పారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగింపు సందర్భంగా ఆయన ఢిల్లీలో ఆంధ్రభవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ "రాష్ట్రంలో స్టీమ్ రైస్ అందించే ప్రయోగాన్ని రాష్ట్రంలోని 42 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో అమలు చేశాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో రాష్ట్రవ్యాప్తంగా స్టీమ్ రైస్ అందిస్తూ, నాణ్యమైన భోజనం పిల్లలకు అందిస్తున్నాం. దీనికి రైతులు తగిన విధంగా సహకరించి 2.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎలాంటి అధిక బోనస్ లు ఆశించకుండా మాకు అందించారు. ఈ విషయాన్ని కేంద్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి దృష్టికి తీసుకెళ్లినపుడు, ప్రజా పంపిణీలో కూడా స్టీమ్ రైస్ పంపిణీ చేయాలని మేం కోరినపుడు మంత్రి దగ్గర నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఓ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అమలు చేస్తామని చెప్పినపుడు కచ్చితంగా దాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**కాకినాడ జిల్లాతో మొదలు**

రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో దేశంలోనే తొలిసారి కాకినాడ జిల్లాలో చౌక డిపోల్లో నాణ్యమైన స్టీమ్ రైస్ బియ్యాన్ని అందజేయాలని నిర్ణయించాం. ప్రజా పంపిణీ ద్వారా ప్రతి రైసు కార్డుదారుడికి, అలాగే పాఠశాలలు, హాస్టల్స్ కు కలిపి జిల్లాకు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయని అంచనా వేస్తున్నాం. ఇక్కడ వచ్చిన ఫలితాలకు అనుగుణంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా స్టీమ్ రైస్ ను చౌకడిపోల్లో అందించేలా ప్రణాళికతో ముందుకు వెళ్తాం. దీంతోపాటు రైతాంగం నుంచి వచ్చిన అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వ అధికారుల వద్ద ప్రస్తావించినపుడు బాయిల్డ్ రైస్ ధాన్యం కోటాను మరికొంత పెంచడానికి అంగీకరించారు. గతంలో ఢిల్లీలో పర్యటించినపుడు మొట్టమొదటిసారి రాష్ట్రానికి అనువుగా 2 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ ధాన్యం సేకరణకు అంగీకరించారు. ఇప్పుడు దానికి అదనంగా మరో 20 వేల మెట్రిక్ టన్నుల సేకరణకు ఒప్పుకున్నారు. ప్రతి గింజను రైతు దగ్గర నుంచి కొంటామని ఇచ్చిన మాటను పూర్తిగా నెరవేరుస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ మార్మోగుతుంది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ పనితీరును ఢిల్లీలో సగర్వంగా చెప్పుకొనే స్థితికి తీసుకురాగలిగాం. నాణ్యమైన సరకులు, మైరైన సేవలు, లాజిస్టిక్స్, రవాణాలో పారదర్శకత, సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఫేషిగా నిలిచి దేశంలోనే రోల్ మోడల్‌గా ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ నిలుస్తోంది. హోల్ సేల్ ధరలకు నిత్యావసర సరకులు అందించే మార్పులతో పోటీపడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మీ మార్ట్'లను ఈ త్రైమాసికంలోనే ప్రారంభిస్తాం. 1000 మార్టులను జిల్లాల వారీగా అవసరం ఉన్న చోట ప్రారంభిస్తాం. దీనిపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, ఎన్.సి.సి.ఎఫ్. మధ్య ఒప్పందం కుదిరింది. మీ మార్టుల్లో అతి తక్కువ ధరకే సరకులు లభిస్తాయి. 70 రకాల సరకులు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

**ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే బియ్యం**

సామాన్యుడికి ధరల భారం పెరగకుండా, ధరల స్థిరీకరణకు కట్టుబడి ఉన్నాం. గత రెండు నెలలుగా రాష్ట్రంలో పెరుగుతున్న బియ్యం ధరలతో సామాన్యుడు పడుతున్న ఇబ్బందులను మేం గుర్తించాం. దీంతో ఆగస్టు 1 వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక అవుట్ లెట్ల ద్వారా బహిరంగ మార్కెట్లో రూ. 62 నుంచి రూ.64లు ఉన్న బీపీటీ స్టీమ్ రైస్ ను రూ.52లకు, బహిరంగ మార్కెట్లో రూ.58లు ధర ఉన్న గ్రేడ్ 1 రా రైస్ ను రూ.50లకు అందించాలని నిర్ణయం తీసుకున్నాం. గతంలో సేకరించి ఎఫ్.సి.ఐ. గోదాముల్లో భద్రపరిచిన స్వర్ణ వెరైటీ రకం బియ్యం లక్ష టన్నుల మేర నిల్వ ఉంది. దాన్ని కూడా వాడుకునేలా కేంద్ర మంత్రి అనుమతి అడిగాం. ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో వచ్చే రోజుల్లో స్వర్ణ వెరైటీ రకం బియ్యాన్ని కూడా రైతు బజార్ల ద్వారా రూ.40లకే అందించాలని భావిస్తున్నాం. దీంతోపాటు రాష్ట్రానికి 73 వేల మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం అని కేంద్ర మంత్రిదగ్గర ప్రస్తావించాం. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని 30 వేల చౌకధరల దుకాణాల్లో బియ్యం, పంచదారతో పాటు నాణ్యమైన కందిపప్పును ప్రతి కార్డుదారుడికి 500 గ్రాముల మేర అందించే ఏర్పాట్లు చేస్తాం. దీంతో పాటు రాష్ట్రానికి 2022–23 ఆర్థిక సంవత్సరం నుంచి రావాల్సిన కేంద్ర నిధులు రూ.281 కోట్లను వెంటనే చెల్లించేలా కేంద్ర మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి బ్యాగు మీద క్యూఆర్‌కోడ్ ఇప్పటి వరకు అమలు చేశాం. అయితే తాజాగా ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ అధికారులు వేగం, నిర్దిష్ట సమాచారం వచ్చేలా రూపొందించిన ఆర్.ఎఫ్.ఐ.డి.విధానాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్రం సానుకూలత వ్యక్తం చేసింది. మొదటగా రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు అమలు చేయాలని సూచించారు. దీన్ని కూడా రాష్ట్రంలోని కాకినాడ జిల్లాలో మొదట ప్రవేశపెట్టి, అక్కడి ఫలితాలను పరిశీలిస్తాం. బియ్యం రైసు మిల్లర్ల వద్ద ప్యాకింగ్ అయ్యే దగ్గర నుంచి వినియోగదారుడికి అందే వరకు ట్రేస్ అండ్ ట్రాకింగ్ పకడ్బందీగా ఈ విధానంలో అమలయ్యేలా చూస్తాం.ఆర్.ఎఫ్.ఐ.డి. ట్యాగ్స్ విప్లవాత్మక నిర్ణయంగా నిలిచిపోతుంది. ఇటీవల గుజరాత్ లో పర్యటించినపుడు గాంధీనగర్, అహ్మదాబాద్ లోని ప్రజా పంపిణీలో అమలు అవుతున్న సీబీడీసీ విధానాన్ని పరిశీలించాం. దాన్ని రాష్ట్రంలో కూడా ఉమ్మడి కృష్ణా జిల్లా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని భావిస్తున్నాం. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న రాయితీని డిజిటల్ వాలెట్ గా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తే, వారికి అవసరం అయిన సరకులను వారు కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. అది వారికి ఆర్థికంగానూ తోడ్పాటునిస్తుంది. ఈ విధానం మీద రకరకాల అపోహలు, ప్రచారాలు చేయాల్సిన అవసరం లేదు. సాంకేతికత వేగం పుంజుకుంటున్న సమయంలో పారదర్శక మార్పులను స్వాగతించాలి. దీంతోపాటు చౌకడిపోల డీలర్లకు కూడా కమీషన్ పెరిగేలా, డిజిటల్ వాలెట్ డబ్బులు ప్రజలు వాడుకోగానే కమీషన్ పడేలా కేంద్రం చొరవ తీసుకుంటోంది. వారు అనవసర ఆందోళన పడాల్సిన అవసరం లేదు" అని చెప్పారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు , పౌర సరఫరాల సంస్థ ఎండీ శ్రీ ఢిల్లీరావు పాల్గొన్నారు.

# అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ- ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ , ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్ ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నొస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది.

**వైద్య రంగంలో పరిశోధనలకు క్వాంటంవ్యాలీ సేవలు**

ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో క్వాంటం పరిశోధనలు జరగాల్సి ఉందని సీఎం సూచించారు. కాలుష్యం లాంటి బాహ్య కారణాల వల్ల కూడా ప్రమాదకరమైన కాన్సర్ బారిన పడుతున్నారని... ముందే గుర్తించి చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వైద్య రంగంలోని వ్యవస్థలు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో పనిచేయాలని సీఎం సూచించారు. ఏపీలో సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటల్ రికార్డులుగా మారుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

వైద్యారోగ్య రంగంలో మరింత వేగంగా ట్రాన్స్‌ఫర్మేషన్ జరగాల్సి ఉందని తెలిపారు. కేన్సర్ తో పాటు ఇతర వ్యాధులపై కూడా అమరావతి క్వాంటం వ్యాలీ నుంచి విస్తృతంగా పరిశోధనలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ జి.సాయి ప్రసాద్, ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ ఏ. ప్రవీణ్ రావు , స్టాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థల ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# డీఎస్సీ అవకతవకలకు ఆస్కారమే లేదు..

(మొదటిపేజీ తరువాయి)


ద్వారా యాదృచ్ఛికంగా ప్రశ్నలు వస్తాయని, ఒక అభ్యర్థికి వచ్చిన ప్రశ్నపత్రం మరొకరికి రాదని వివరించింది. దీనివల్ల మాస్ కాపీయింగ్‌కు గానీ, ముందుగా ప్రశ్నలు తెలుసుకునేందుకు గానీ ఆస్కారం ఉండదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ప్రతి పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్ హాజరు, వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ నిఘా వంటి బహుళస్థాయి భద్రతా ఏర్పాట్లు చేసి పరీక్షలు నిర్వహించామని పేర్కొంది. దరఖాస్తు స్వీకరణ నుంచి హాల్ టికెట్ల జారీ, ఆన్‌లైన్ పరీక్ష, ఫలితాల వెల్లడి,తుది ఎంపిక వరకు ప్రతి దశలోనూ పారదర్శ కతకు పెద్దపీట వేశామని ప్రభుత్వం వివరించింది.

**గత ప్రభుత్వ విధానాలపై విమర్శలు**

ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ నియామకాలపై అనుసరించిన వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం తప్పుబట్టింది. గత పాలకులు 'మెగా డీఎస్సీ' అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసి, చివరికి 'టెట్ కమ్ టీఆర్టీ' పేరుతో నియామకాలు చేపట్టి అభ్యర్థులను గందరగోళానికి గురిచేశారని ఆరోపించింది. 2024 ఎన్నికల ముందు కేవలం 6,100 పోస్టులతో నోటిఫికే షన్ ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారని విమర్శించింది. అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సంఖ్యను 16,347కు పెంచి, నిరుద్యోగ యువతకు అండగా నిలిచిందని గుర్తుచేసింది. గతంలో జరిగినట్లుగా అసంబద్ధ విధానాలకు, అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకునే చర్యలకు తమ పాలనలో తావులేదని స్పష్టం చేసింది.

**అభ్యర్థులకు అండగా ఉంటాం**

ఏళ్ల తరబడి కష్టపడి చదివి, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన అభ్యర్థుల శ్రమ వృథా కాదని




ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రతిభ, నిబద్ధత, కఠోర శ్రమను నమ్ముకున్న వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని పేర్కొంది. కొందరు కావాలనే అవాస్తవ ప్రచారాలతో అభ్యర్థులను తప్పుదోవ పట్టించి, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మవద్దని సూచించింది. ఈ నియామక ప్రక్రియలో ఏ ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగదని, కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపికలు ఉంటాయని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి రాజీకి తావులేదని, ఈ విషయంలో తమ ప్రభుత్వ నిబద్ధతను ఎవరూ శంకించాల్సిన పనిలేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది.

# పీఓకే ఎన్నికలు... పాకిస్థాన్‌పై భారత్ ఘాటు విమర్శ

(మొదటిపేజీ తరువాయి)

న్యూఢిల్లీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఆక్రమించుకున్న ప్రాంతాలతో సహా మొత్తం జమ్ముకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు భారత్‌లో అభేద్యమైన అంతర్భాగమని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఎన్నికల ప్రక్రియ, పాకిస్థాన్ తన అక్రమాలను దాచిపెట్టడానికి చేస్తున్న ప్రయత్నం తప్ప మరొకటి కాదని ఆయన స్పష్టం చేశారు. పీఓకేలో మొత్తం 53 అసెంబ్లీ స్థానాలకు గాను, 45 స్థానాలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మిగతా 8 స్థానాలకు నేరుగా మహిళలు, వివిధ రంగాల నిపుణులు, మతగురువులను నామినేట్ చేస్తారు. కాగా, పీఓకేలో జూలై 27 నుంచి ఆగస్టు 10 మధ్య పోలింగ్ జరగనుంది. సోమవారం ముగిసిన తొలి దశ ఎన్నికల్లో పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) 9, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) 4 స్థానాల్లో విజయం సాధించాయి. కాగా, ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ ఈ ఎన్నికలను బహిష్కరించింది. తొలి దశ పోలింగ్ అనంతరం పెద్ద ఎత్తున రిగ్గింగ్ ఆరోపణలు వెల్లువెత్తాయి. తాము విజయం సాధించాల్సిన కొన్ని సీట్లను పీఎంఎల్-ఎన్‌కు 'బహుమతిగా' కట్టబెట్టారని పీపీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

# వేణుగోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు




గూడూరు, (సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా; గూడూరు గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ నందు రోటరీ క్లబ్ గూడూరు ద్వారా రొటేరియన్ బండి శ్రీధర్ రెడ్డి వారి తండ్రి బండి వేణుగోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం నవజాత శిశువులకు బేబీ క్యాప్స్, చిన్న దోమతెరలు, ఒక వీల్ చైర్ మరియు హాస్పిటల్ కొరకు త్రి సీట్ ఐరన్ చైర్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో క్లబ్బు ప్రెసిడెంట్ తిరుమూరు సురేష్ రెడ్డి సెక్రటరీ కొసరాజు నాగ సునీల్ కుమార్ మరియు ఇతర రొటేరియన్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ తిరుమూరు సురేష్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గూడూరు ఏరియా గవర్నమెంట్ హాస్పిటల్ కు ఎన్నో సేవలు చేసి ఉన్నామని అందులో ముఖ్యంగా ఫిజియోథెరపీ ఎక్విప్మెంట్స్ మరియు కూలర్స్, ఇంకా ఎన్నో అవసరమైన వస్తువులను ఇచ్చామని అదేవిధంగా మంగళవారం కార్యక్రమ దాత బండి శ్రీధర్ రెడ్డి నవజాత శిశువులకు అవసరమైన బ్లాంకెట్స్ దోమతెరలు, వీల్ చైర్, మరియు త్రీ సీడ్స్ విజిటర్స్ చైర్ ఇవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలియజేశారు.రొటేరియన్ దశరథ రామ్ రెడ్డి మరియు బండి శ్యామ సుందర్ రావు మాట్లాడుతూ దాత బండి శ్రీధర్ రెడ్డి ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తిరుమూర్ సురేష్ రెడ్డి, సెక్రెటరీ కొసరాజు నాగ సునీల్ కుమార్, దాత బండి శ్రీధర్ రెడ్డి, ముని గిరీష్, సర్వీస్ ప్రాజెక్ట్ చైర్మన్ ఎన్ బాలకృష్ణం రాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బండి శ్యాంసుందర్రావు, సీనియర్ రొటేరియన్స్ బి దశరథ రామిరెడ్డి, పి రఘురామిరెడ్డి, పీవీ కృష్ణయ్య, ఫాస్ట్ ప్రెసిడెంట్స్ పి హరి ప్రసాద్, కిరణ్ చక్రవర్తి, డాక్టర్ ఎస్ వి. నాగేంద్ర ప్రసాద్, శేగు లక్ష్మీ ప్రసాద్, పబ్లిక్ ఇమేజ్ చైర్ బొల్లు రాంప్రసాద్ పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయాలి

## అంగన్వాడీ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి



గూడూరు (సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా; అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనాలు పెన్షన్ పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని ఈ నెల 31వ తేదీ నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని అంగన్వాడి కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు రెహనా బేగం వెల్లడించారు.గూడూరు పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 31వ తేదీ నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నా పోస్టర్ను విడుదల చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు రెహనా బేగం మాట్లాడుతూ అనేక రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని ప్రైవేటు ఔట్సోర్సింగ్ విధానంలో తీసుకుంటున్నారని అన్నారు. చాలీచాలని జీతాలతో అంగన్వాడీ వర్కర్లు పనిచేస్తున్నారని 2019 సంవత్సరము నుండి అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు పెరగలేదని గుర్తు చేశారు. అంగన్వాడీ వర్కర్ల డిమాండ్ల పరిష్కారం కొరకు ఈనెల 31వ తేదీ నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్మికులంతా పాల్గొని దీన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇందిరావతి, ప్రభావతి ,లక్ష్మీ ,ఆసియా బేగం, ముని కుమారి ,అరుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పొంగళ్ళు

గూడూరు( సింధూరదర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆషాడమాసం మంగళవారం సందర్భంగా వాసవి మహిళా సమాజం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి పొంగళ్ళు సమర్పించారు.ఆషాడ మాసం మంగళవారం సందర్భంగా గూడూరు వాసవి మహిళా సమాజం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు స్థానిక శివాలయం లో అమ్మవారికి పొంగళ్ళు తయారు చేసి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వాసవి దేవస్థానం వరకు వచ్చి అమ్మవారికి పొంగళ్ళు సమర్పించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళా సమాజం ఉపాధ్యక్షురాలు పాదర్తి సుప్రజ మాట్లాడుతూ ఆషాడ మాసం మంగళవారం సందర్భంగా అమ్మవారికి పొంగళ్ళు కార్యక్రమం నిర్వహించామని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు పోకూరు చంద్రకళ ,సెక్రటరీ భీమవరం ఉషా ,సభ్యులు ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.



# పెట్రోలు బంక్ డీలర్ల మార్జిన్‌ను 5 శాతానికి పెంచాలి

**కేంద్ర మంత్రికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి**

**పెట్రోలియం డీలర్ల సమస్యలపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ తో భేటీ**

**నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**

**2017 నుంచి డీలర్ మార్జిన్ పెంపు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డీలర్ల ఆవేదన**

**డీలర్ల వినతిపత్రంతో పాటు సమగ్ర నివేదికను కేంద్ర మంత్రికి అందజేసిన ఎంపీ**

**సానుకూలంగా స్పందించిన మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ**



ఢిల్లీ సింధూర దర్శిని

పెట్రోలు, డీజిల్ రిటైల్ అవుట్‌లెట్ డీలర్లకు 2017 నుంచి పెరగని మార్జిన్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రిటైల్ విక్రయ ధరలో 5 శాతానికి పెంచాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ కి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల తమ వ్యాపార సమస్యలను నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యల పరిష్కారం కోసం ఎంపీ వెంటనే స్పందించారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీని కలిసి డీలర్ల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మంత్రికి అందజేసిన లేఖలో, 2017 నుంచి పెట్రోలు, డీజిల్ రిటైల్ అవుట్‌లెట్ డీలర్ల మార్జిన్‌లో ఎలాంటి పెంపు జరగలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం పెట్రోల్‌పై లీటరుకు రూ.3.50, డీజిల్‌పై లీటరుకు రూ.2.40 మాత్రమే డీలర్ మార్జిన్‌గా కొనసాగుతుండగా, గత తొమ్మిదేళ్లలో ఉద్యోగుల వేతనాలు, విద్యుత్ ఛార్జీలు, రవాణా, నిర్వహణ, మరమ్మతులు, బ్యాంకు వడ్డీలు, లీగల్ మెట్రాలజీ శాఖ ఫీజులు, ఇతర చట్టపరమైన ఖర్చులు, ఆస్తి పన్నులు తదితర నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగాయని వివరించారు. అయినప్పటికీ డీలర్ మార్జిన్‌లో ఎలాంటి మార్పు లేకపోవడంతో రిటైల్ అవుట్‌లెట్‌ల నిర్వహణ డీలర్లకు తీవ్ర ఆర్థిక భారంగా మారిందని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న మార్జిన్‌కు బదులుగా పెట్రోలు, డీజిల్ రిటైల్ విక్రయ ధరలో 5 శాతం డీలర్ మార్జిన్‌ను అమలు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే అపూర్వ చంద్ర కమిటీ చేసిన సిఫార్సులను కూడా లేఖలో ప్రస్తావించారు.

హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ సంస్థల ఛైర్మన్లు, అఖిల భారత పెట్రోలియం డీలర్ల సంఘాల ప్రతినిధులతో కూడిన కమిటీ, డీలర్ల నిర్వహణ వ్యయాలు, పెట్టుబడులు, బ్రేక్‌ఈవెన్ విక్రయాల ఆధారంగా డీలర్ మార్జిన్‌ను నిర్ణయిస్తూ, ప్రతి ఏడాది జనవరి, జులై నెలల్లో దానిని పునఃసమీక్షించే విధానాన్ని అమలు చేయాలని సిఫార్సు చేసిందని పేర్కొన్నారు. ఈ విధానం అమలైతే నిర్వహణ వ్యయాలు, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా డీలర్ల మార్జిన్ ఆటోమేటిక్‌గా సవరణ జరుగుతుందని, న్యాయమైన, పారదర్శక వ్యవస్థ ఏర్పడుతుందని లేఖలో పేర్కొన్నారు. ఈ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని డీలర్ల వినతిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రి ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఎంపీ విజ్ఞప్తిపై హర్దీప్‌సింగ్ పూరీ సానుకూలంగా స్పందించారు. సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పారిశుద్ధ్య కార్మికులకు సామర్థ్యాభివృద్ధి నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

## మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



గూడూరు (సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా; స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో, నాలెడ్జ్ పార్ట్నర్ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సహకారంతో గూడూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల కోసం సామర్థ్యాభివృద్ధి మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గూడూరు మున్సిపల్ కమిషనర్ వై. మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, వర్షాకాలంలో పట్టణ పరిశుభ్రతను కాపాడడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. డ్రైన్లు, కాలువలను నిరంతరం శుభ్రపరచడం, వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడం, దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు విధి నిర్వహణలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సేవలందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ధీనరాజ్ , వెంకటయ్య పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రైనేజీల నిర్వహణ, వ్యర్థాల సకాలంలో సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాల్లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లు ఎస్. వెంకటేశ్వర్లు, డి. కోటేశ్వరరావు శిక్షణను నిర్వహించారు. వారు మాన్సూన్ ప్రిపేర్డ్‌నెస్ పై సమగ్ర అవగాహన కల్పిస్తూ, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, డ్రైనేజీల నిర్వహణ, నీటి నిల్వల నివారణ, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, పారిశుద్ధ్య సిబ్బంది భద్రత వంటి అంశాలను వివరించారు. అలాగే ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు ప్రకారం నాలుగు బిన్ల వద్దే వ్యర్థాల వేరు చేయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, గృహ ప్రమాదకర వ్యర్థాలు మరియు శానిటరీ/ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరు బిన్లలో సేకరించడం ద్వారా వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, రీసైక్లింగ్ మరియు పర్యావరణ పరిరక్షణ సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. ఇంటింటా నాలుగు బిన్ల విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ మూలస్థాయిలోనే వ్యర్థాలను వేరు చేసే అలవాటును పెంపొందించాలని రిసోర్స్ పర్సన్లు సూచించారు. ఈ విధానం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, స్థిరమైన పట్టణాల నిర్మాణం సాధ్యమవుతుందని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గూడూరు మున్సిపాలిటీకి చెందిన పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ విధి నిర్వహణలో అమలు చేస్తామని సంకల్పించారు.

# రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి సంక్షేమం: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



విడవలూరు (సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా ; ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకు తలెత్తుకుని వెళ్లగలదని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మంగళవారం విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' పేరుతో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం వరుసగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇచ్చిన హామీల్లో దాదాపు 99 శాతం అమలు చేశామని పేర్కొన్నారు.ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్‌ను ఇంటి వద్దకే అందిస్తున్నామని, దివ్యాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందజేస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల కోసం తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తున్నామని, స్త్రీశక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 పథకం కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఎకరాకు రూ.20 వేలు, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేలు, ఆటో సేవలో పథకం కింద ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. పేదల కోసం అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించామని, రైతుల ప్రయోజనాల కోసం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి భూముల రీసర్వే అనంతరం రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీ డ్రెయిన్లు నిర్మించాలని పలువురు కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ పనులను త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు అందించిన ఇతర వినతులను కూడా దశలవారీగా పరిష్కరిస్తామని, ఈసారి పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేసిన తర్వాతే మళ్లీ గ్రామానికి వస్తానని ప్రజలకు మాటిచ్చారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని, అదే సమయంలో ప్రజల సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు.

# రహదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



## జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి (సింధూర దర్శిని) 28 జూలై తిరుపతి జిల్లా ; జాతీయ రహదారులు పనులు శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజ పట్నం పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి, రాయల్ ఎంఫీల్డ్ కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు తో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పిడి లు, రవీంద్ర రావు, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, టిటిడి వెల్ఫేర్ అధికారి, ఎస్ఈ ఇరిగేషన్, ఆర్అండ్ బి ఎస్ఈ, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు, తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, 3 కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, శ్రీ సిటీ ఫేజ్ - 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, రాయల్ ఎంఫిల్డ్ ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, విసిఐసి రోడ్డు, ఏపిఐఐసి ప్రాజెక్ట్స్,వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి - శ్రీకాళహస్తి, ఏర్పేడు-పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, పాకాల - తిరుపతి, తిరుపతి - కాట్పడి అర్కోణం - రేణిగుంట, సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను, దుగ్గరాజపట్నం, వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్ల రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యతతో పనులు పూర్తి కావాలని అన్నారు. ఎయిర్పోర్ట్, ఇస్రో, కరకంబాడి, ఎమ్ ఐ జి లే అవుట్ తిమ్మాజికండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాల న్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వడమాలపేట, ఏర్పేడు మండలాలలో పాదిరేడు అరణ్యం, పల్లం గ్రామాల నందు టీటీడీ ఉద్యోగస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కూడా త్వరితగతిన చర్యలు తీసుకొని పూర్తి చేయా లన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి. నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి,సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, బానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి రాంప్రసాద్, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్,సంబంధిత తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు భాస్కర్, భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

-రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు
-జిల్లాలోని పలు సంస్థలను సందర్శించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్, సభ్యురాలు
-అంగన్వాడీ కేంద్రాలు, చిల్డ్రన్ హోమ్, వైద్య సేవలు, హాస్టల్లో అందుతున్న సేవలపై పరిశీలన



నెల్లూరు( సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా ; బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, విద్య, ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సేవలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు, కమిషన్ సభ్యురాలు కె.జి. వెంకట పద్మలత సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లాలోని పలు ప్రభుత్వ, శిశు సంరక్షణ సంస్థలను సందర్శించి అక్కడ చిన్నారులకు, విద్యార్థులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలించారు. మొదటగా రామ్నగర్ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలించారు. బాలల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నందున నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం బీవీ నగర్లోని జనహిత చిల్డ్రన్ హోమ్ను సందర్శించి అక్కడ నివసిస్తున్న పిల్లలతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారి ఆరోగ్యం, విద్య, ఆహారం, వసతి, ఇతర సంక్షేమ సౌకర్యాలపై ఆరా తీసి, జువెనైల్ జస్టిస్ (బాలల సంరక్షణ మరియు పరిరక్షణ) చట్టం--2015 నిబంధనలకు అనుగుణంగా హోమ్ నిర్వహణ జరుగుతున్న తీరును పరిశీలించారు. పిల్లల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన సంరక్షణ అందించాలని హోమ్ యాజమాన్యానికి సూచించారు. తదుపరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుజాతతో కలిసి కృష్ణ స్కాన్ సెంటర్ను సందర్శించి చిన్నారులకు అందుబాటులో ఉన్న వైద్య నిర్ధారణ సేవలు, వైద్య పరికరాలు, నాణ్యత ప్రమాణాలపై సమీక్ష నిర్వహించారు. అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ప్రతినిధులకు సూచించారు. చివరిగా నెల్లూరు నగర పరిధిలోని బట్వాడిపాలెం ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్ను సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. వారి విద్యాభ్యాసం, వసతి, ఆహారం, ఆరోగ్యం, క్రీడలు, ఇతర సంక్షేమ సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికార అధికారి బి. హేనా సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ అరుణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు శోభారాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

22-ఏ, డాటెడ్ ల్యాండ్స్, రీ సర్వే, పీజీఆర్ఎస్ అర్జీలను వేగవంతంగా పరిష్కరించండి
ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల
22-ఏ, డాటెడ్ ల్యాండ్స్ కేసులను 15 రోజుల్లో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశం



నెల్లూరు( సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లాలో 22-ఏ, డాటెడ్ ల్యాండ్స్, రీ సర్వే, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో.. జేసి మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్ లతో కలసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల 22-ఏ, డాటెడ్ ల్యాండ్స్, రీ సర్వే, పీజీఆర్ఎస్ అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు అనుగుణంగా 22-ఏ, డాటెడ్ ల్యాండ్స్కు సంబంధించిన ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి 15 రోజుల లోపు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని, ప్రతి కేసులో పూర్తి స్థాయి పరిశీలన అనంతరమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఒక్క అర్జీ కూడా ఎస్ఎల్ఏ గడువు దాటకుండా చర్యలు తీసుకోవాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పూర్తిగా తెలుసుకొని, పారదర్శకంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పనుల పురోగతిని సమీక్షించిన జిల్లా కలెక్టర్, ఎలాంటి పెండింగ్ లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. ఇకపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తానని, ప్రతి అధికారి తన పరిధిలో స్పష్టమైన పురోగతి చూపించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్లను సైతం దాటి వస్తున్న నాపరాయి బాడుగుట్టలు

ప్రభుత్వ ఆస్తులు దేవుడు మాన్యాలు ఆక్రమించుకుంటున్న వైనం
చోద్యం చూస్తున్న ఆర్ అండ్ బి అధికారులు
మండిపడుతున్న వామపక్ష ప్రజాసంఘాల నాయకులు

బనగానపల్లె (సింధూర దర్శిని) 28 జులై నంద్యాల జిల్లా ; బనగానపల్లె మండలం పలుకూరు నుండి రోడ్డు ఆక్రమణలకు గురవుతున్నాయి నాపరాయి బాడుగుట్టలు రోడ్లు మూసుకు వచ్చేసరికి వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు సైతం తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పలుకూరు ప్రాంతంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆస్తులు, దేవాదాయ భూములు ఆక్రమణలకు గురి అవుతున్నాయి. ఎంతోమంది ఈ భూ అక్రమాలపై పోరాడి పోరాడి అలసిపోయారు. దొంగలు , దొంగలు, కలిసి ఊర్లు పంచుకున్నట్టు ఇవాళ కంచనే చేను మేసే విధంగా ఉంది ఎవరైతే ప్రభుత్వంలో ఉన్నారో వారు ఇలాంటి భూములను కాపాడాల్సింది ఉంది , కానీ రోడ్లు సైతం తవ్వేస్తున్న ఆర్డబి అధికారులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టు వాళ్లు ఆఫీసులకే పరిమితమై ఉన్నారు. ఒకవైపు దేవాదాయ భూములు ఆక్రమవుతున్న దేవదాయ శాఖా అధికారులు మొద్దు నిద్రలో వున్నారు. అక్రమ మైనింగ్ చేస్తావున్న ఏమి అనలేని పరిస్థితి లో వున్నారు. అధికారులను కలిస్తే మీకు తెలుసు కదా మా పరిస్థితి అర్థం చేసుకోండి అని వారంటున్నారు. ఈ పరిస్థితిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వ ఆస్తులను దేవాదాయస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులు ప్రభుత్వం పైనే ఉంది. ఈ విషయంపై జిల్లా అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బనగానపల్లె మండల్ సమితిగా డిమాండ్ చేస్తా ఉన్నాం . లేనియెడల ఎర్ర జెండా పట్టుకుని ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నాం. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి శివయ్య సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు పలుకూరు శాఖ కార్యదర్శి బాలయ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రి స్వామి పాల్గొన్నారు.

# చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి: సి.ఐ.టి.యు నాయకులు



గూడూరు( సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా; మున్సిపల్ పారుశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని,జులై 30న నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని, గూడూరు పట్టణ పరిధిలో మంగళవారం వేకువ జామున 5 గంటలకు సి.వి.సి పార్క్,ముత్యాల పేట, కోర్ట్ సెంటర్, మాలవ్య నగర్, మున్సిపల్ కార్యాలయము, మస్టర్ పాయింట్ల నందు మున్సిపల్ కార్మికులతో సమావేశాలు నిర్వహించి, మున్సిపల్ ఉద్యోగులు,కార్మికులు, పట్టణ ప్రజలకు నష్టదాయకమైన ప్రైవేటీకరణ వ్యతిరేకించండి, పట్టణ ప్రజల పైన యూజర్ చార్జీల పేరుతో భారాల మోపుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 975,673, జీవోలను తక్షణమే ఉపసంహరించాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల మేరకు మున్సిపల్ కార్మికులు పర్మినెంట్ చేయాలని, సమాన పనికి-సమాన వేతనం ఇవ్వాలని పలు డిమాండ్లపై ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ఉద్యోగులు, కార్మికులతో పాటు పట్టణ ప్రజానీకం కూడా పెద్ద ఎత్తున పాల్గొని,ఈ నెల 30వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు నివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ.టి.యు కార్యదర్శి బి.వి. రమణయ్య,జిల్లా మున్సిపల్ సంఘ నాయకులు ధారా కోటేశ్వరరావు, గూడూరు మున్సిపల్ సంఘ అధ్యక్షులు మణెమ్మ, కార్యదర్శి భూలోక మురళి,మహేంద్ర,మున్సిపల్ కార్మికులు జి.మేరీ, గోవిందు, శ్రీనివాసులు, పి.గోపికృష్ణ,నిర్మలమ్మ, ఆనంద్,పెంచలమ్మ, రాజేష్,విజయ్ చరణ్, అరుణమ్మ, నాగమ్మ,శ్రీను మహేష్,మస్తాన్,దేవి, వెంకటేష్, చినచెంచయ్య,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు

గూడూరు, (సింధూరదర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా; గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో ఉన్న శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు. అన్నదానానికి దాతలుగా పడిదం సుబ్రహ్మణ్యం లక్ష్మి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.



# డిఎస్సీ నియామకాలపై విషం చిమ్ముతున్న వైసిపి



**వైసీపీకి మాతో చర్చకు వచ్చే ధైర్యం ఉందా**

**గూడూరు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు నవీన్ చంద్ర**

గూడూరు( సింధూరదర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా; గూడూరు నియోజకవర్గం శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆసనాపురం వెంకటేష్ సేచనలమేరకు డిఎస్సీ పైన వైఎస్ఆర్సిపి చేస్తున్న విషప్రచారని తిప్పి కొట్టిన గూడూరు టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షులు నవీన్ చంద్ర యాదవ్ . ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకోచ్చారు. ఈరోజు డిఎస్సీ మీద వైఎస్ఆర్సిపి చేస్తున్న కార్యక్రమం ఉద్దేశపూర్వకంగా చేసిన నిరసన. డిఎస్సీ లో ఉద్యోగాలు సంపాదించిన వారికి రిమూవ్ చేయాలని వైయస్సార్సీపి టీచర్స్ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి హైకోర్టులో పిల్ ఎందుకు వేశారో చెప్పాలి.

**డీఎస్సీ – ఉద్యోగ నోటిఫికేషన్లు**

"విద్యతోనే వికాసం.. ఉద్యోగాలతోనే ఉపాధి" అనే నినాధంతో ద్శాబ్దాలుగా దార్శనికుడి నాయకత్వంలో అడుగులు వేస్తుంది టీడీపీ పార్టీ. గత చరిత్ర ను పరిశీలిస్తే రాష్ట్రం లో నిరుద్యోగ యువత కు అత్యధికం గా ప్రభుత్వ ఉద్యోగాలు కలిపంచిన ఘనత టీడీపీకే దక్కుతుంది అన్నారు. మెగా డీఎస్సీల బ్రాండ్ – తెలుగుదేశం ప్రభుత్వం అని ఆంధ్రప్రదేశలో విద్యా విధానాలు బలోపేతం, నిరుద్యోగ నిర్మూలన అనగానే గుర్తతచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. శతాబ్దాల చరిత్రలో ఎన్నడు లేని విధంగా, కేవలం ఒకే పార్టీ హయంలో ఏకంగా 1,96,619 ఉపాధ్యాయులు పోస్టులు భర్తీ అవ్వడం జరిగింది అని ఇది చరిత్రాత్మక రికార్డు అని అన్నారు.

1994 నుండి 2025 వరకు టీడీపీ హయంలో జరిగిన ఉపాధ్యాయ నియమకాలు ఒక రికార్డు అని. కేవలం రెగ్యులగర్ నియామకాలు ద్వారానే 1.52 లక్షల మంది యువతకు ఉపాధ్యాయులుగా మారే అవకాశం కలిపంచడమే కాకుండా, ప్రత్యేక కేటగిరీల కోసం లిమిటెడ్, స్పెషల్ డిఎస్సీ లను సైతం నిర్వహించింది తెలుగుదేశం ప్రభుత్వం అన్నారు. వై ఎస్ ఆర్ సి పి అధికారం లో ఉన్నప్పుడు ఒక్క డిఎస్సీ కానీ నిరుద్యోగ యువత కు ఉద్యోగాలు ఇచ్చిన పాపాన పోలేదు ఈరోజు ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తూ ఉంటే కావాలనే ప్రభుత్వం మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. టీచర్లను మద్యం షాపులు దగ్గర పెట్టిన ఘనమైన ఘనత వై ఎస్ ఆర్ సి పి కే దక్కుతుంది అన్నారు. సకాలంలో ఏ ఒక్క నెల జీతాలు ఇవ్వలేని వైఎస్ఆర్సిపి ఈరోజు డిఎస్సీ మీద మరియు టీచర్ల ప్రేమను నటించడం దెయ్యాలు వేదాలు వర్ణించినట్టు ఉంది అన్నారు. ఈ కార్యక్రమం టీఎన్ఎస్ఎఫ్ కార్యదరి పవన్, జగదీష్, హర్షవర్ధన్, మురళి, రమేష్, ధనుష్, విశ్వక్ తదితరులు పాల్గొన్నారు.




## ఎల్‌నినో ప్రభావం పై సమీక్ష సమావేశం

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్**

తిరుపతి( సింధూర దర్శిని) 28 జూలై తిరుపతి జిల్లా ; రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్రం లోని రెవెన్యూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలు, 22ఏ, రీ సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, అటవీ భూములు, వ్యవసాయం పై ఎల్ నినో ప్రభావం తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లాకలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, జేసి ఆర్.గోవింద రావు, డిఆర్ఓ జి. నరసింహులు, తిరుపతి, శ్రీ కాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డిఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, అగ్రికల్చర్ జే డి ప్రసాద్ రావు, ల్యాండ్స్ అండ్ సర్వే ఏ డి రామచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రీ సర్వే ను సమర్థవంతంగా నిర్వహించాలని రీ సర్వే కు వెళ్ళే ముందు భూ యజమానికి ముందస్తు సమాచారం పంపాలని తెలిపారు. మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలై జేషన్ ను తప్పులు లేకుండా చేయాలని ఆదేశించారు. ఎల్ ని నో కారణంగా వాతావరణం వేడెక్కడంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, రైతులు కృత్రిమ ఎరువుల పై ఆధారపడకుండా ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.

## హరిత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి

**2047 నాటికి 50 శాతం హరిత నెల్లూరు లక్ష్య సాధనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలి**

**జిల్లా అటవీ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

**హరిత కార్యక్రమాల అమలుకు శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం**



నెల్లూరు( సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా; జిల్లాలో 2047 నాటికి 50 శాతం హరితావరణం సాధించే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన హరిత కార్యక్రమాలను విజయ వంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్, హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జిల్లా అటవీ కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఉద్యానవనశాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్‌శాఖ, విద్యాశాఖ, పరిశ్రమలశాఖ, నీటిపారుదలశాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రోడ్లు ఢ భవనాల శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, అటవీ శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులతో హరిత కార్యక్రమాల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పలు హరిత కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. 2047 నాటికి 50 శాతం హరితావరణ లక్ష్య సాధన, గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ , స్కూల్ నర్సరీ యోజన , నమోవన్ – నగర్ వన్ యోజన, ప్రతి గ్రామంలో తాటి తోటల ఏర్పాటు, గ్రామ పంచాయతీల ఉమ్మడి భూముల్లో కార్యక్రమం కింద కలప జాతుల మొక్కల పెంపకం, సీడ్ బాల్ డిస్పర్సల్, పీఎం–ఆర్‌కేవీవై అగ్రో ఫారెస్ట్రీ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించా లని సూచించారు. హరిత కార్యక్రమాల అమలుకు సంబంధించి ప్రతి శాఖ తన పరిధిలోని రహదారుల పొడవు, కాలువల వివరాలు, చెరువుల జాబితా, మొక్కలు నాటేందుకు అనువైన ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పాఠశాలల వివరాలు, స్కూల్ నర్సరీల ఏర్పాటుకు ప్రతిపాదనలు, నమోవనాల ఏర్పాటు చేయగల ప్రాంతాలు, తాటి తోటల అభివృద్ధికి అనువైన స్థలాలు, గ్రామాల్లో కలప జాతుల మొక్కల పెంపకానికి అనుకూల భూములు, గ్రేట్ గ్రీన్ వాల్ కార్యక్రమానికి అనువైన ప్రాంతాల వివరాలను సమగ్రంగా సేకరించి త్వరితగతిన జిల్లా అటవీ శాఖకు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, భూసార పరిరక్షణ, భూగర్భ జలాల వృద్ధి, జీవవైవిధ్య సంరక్షణకు హరిత కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి (టెరిటోరియల్) కె. మహబూబ్ బాషా, సోషల్ ఫారెస్ట్రీ జిల్లా అటవీ అధికారి ఎం.నాగార్జునరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి డి. వసుమతి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఆర్.బాలాజీరావు పాల్గొన్నారు.

## డిఎస్సీ నియామకాలు పై విషం చిమ్ముతున్న వైసిపి

**వైసీపీకి మాతో చర్చకు వచ్చే ధైర్యం ఉందా**

**గూడూరు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు నవీన్ చంద్ర**

గూడూరు(సింధూరదర్శిని)28జూలై నెల్లూరుజిల్లా; గూడూరు నియోజక వర్గం శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆసనాపురం వెంకటేష్ సూచనల మేరకు డిఎస్సీ పైన వైఎస్ఆర్సిపి చేస్తున్న విషప్రచారని తిప్పి కొట్టిన గూడూరు టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షులు నవీన్ చంద్ర యాదవ్. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకోచ్చారు. ఈరోజు డిఎస్సీ మీద వై ఎస్ ఆర్ సి పి చేస్తున్న కార్యక్రమం ఉద్దేశపూర్వకంగా చేసిన నిరసన. డిఎస్సీ లో ఉద్యోగాలు సంపాదించిన వారిని రిమూవ్ చేయాలని వైయస్సార్సీపి టీచర్స్ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి హై కోర్టు లో పిల్ ఎందుకు వేశారో చెప్పాలి.

**డీఎస్సీ –ఉద్యోగ నోటిఫికేషన్లు**

"విద్యతో నే వికాసం.. ఉద్యోగాలతోనే ఉపాధి" అనే నినాధంతో ద్శాబ్దాలుగా దార్శనికుడి నాయకత్వంలో అడుగులు వేస్తుంది టీడీపీ పార్టీ. గత చరిత్ర ను పరిశీలిస్తే రాష్ట్రం లో నిరుద్యోగ యువత కు అత్యధికం గా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుంది అని అన్నారు. మెగా డీఎస్సీల బ్రాండ్– తెలుగుదేశం ప్రభుత్వం అని ఆంధ్రప్రదేశలో విద్యా విధానాలు బలోపేతం, నిరుద్యోగ నిర్మూలన అనగానే గుర్తుకు వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే మన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అని అన్నారు. శతాబ్దాల చరిత్రలో ఎన్నడు లేని విధంగా, కేవలం ఒకే పార్టీ హయంలో ఏకంగా 1,96,619 ఉపాధ్యాయులు పోస్టులు భర్తీ అవ్వడం జరిగింది అని ఇది చరిత్రాత్మక రికార్డు అని అన్నారు. 1994 నుండి 2025 వరకు టీడీపీ హయంలో జరిగిన ఉపాధ్యాయ నియమకాలు ఒక రికార్డు అని. కేవలం రెగ్యులగర్ నియామకాలు ద్వారానే 1.52 లక్షల మంది యువతకు ఉపాధ్యాయులుగా మారే అవకాశం కలిపంచడమే కాకుండా, ప్రత్యేక కేటగిరీల కోసం లిమిటెడ్, స్పెషల్ డిఎస్సీ లను సైతం నిర్వహించింది తెలుగుదేశం ప్రభుత్వం అన్నారు. వైఎస్ఆర్సిపి అధికారంలో ఉన్నప్పుడు ఒక్క డిఎస్సీ కానీ నిరుద్యోగ యువత కు ఉద్యోగాలు ఇచ్చిన పాపాన పోలేదు ఈరోజు ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తూ ఉంటే కావాలనే ప్రభుత్వం మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. టీచర్లను మద్యం షాపులు దగ్గర పెట్టిన ఘనమైన ఘనత వై ఎస్ ఆర్ సి పి కే దక్కుతుంది అని అన్నారు. సకాలంలో ఏ ఒక్క నెల కూడా జీతాలు ఇవ్వలేని వైఎస్ఆర్సిపి ఈరోజు డిఎస్సీ మీద మరియు టీచర్ల ప్రేమను నటించడం దెయ్యాలు వేదాలు వర్ణించినట్టు ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమం టీఎన్ఎస్ఎఫ్ కార్యదరి పవన్ , జగదీష్ , హర్షవర్ధన్ , మురళి, రమేష్, ధనుష్, విశ్వక్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తులందరి పై అంకమ్మ తల్లి కరుణాకటాక్షాలు ఉండాలి

**విడవలూరు శ్రీ అంకమ్మ దేవాలయంలో తిరునాళ్ల మహోత్సవం**

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**


విడవలూరు( సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా ; భక్తుల పాలిట కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రజల విశ్వాసం పొందిన శ్రీ అంకమ్మ తల్లి కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రార్థించారు. విడవలూరు గ్రామంలోని శ్రీ అంకమ్మ దేవాలయంలో జులై 26 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన పరువు పళ్లెములు కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం నిర్వహించిన ప్రత్యేక అభిషేకంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, పిలిస్తే పలికే దైవంగా ప్రజల విశ్వాసాన్ని పొందిన శ్రీ అంకమ్మ తల్లి అనుగ్రహం భక్తులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. శ్రీ అంకమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 30వ తేదీ గురువారం జరిగే పారువేట కార్యక్రమంతో వైభవంగా ముగియనున్నాయి.

## భోగాపురం ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాలి

**నియోజకవర్గం, మండల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం**

**గూడూరు ఎమ్మెల్యే పీఎం ప్రోగ్రాం అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి పాశం సునీల్ కుమార్**

అనకాపల్లి సింధూరదర్శిని: ప్రధానమంత్రి భోగాపురం ప్రోగ్రాంను విజయవంతం చేయాలని గూడూరు ఎమ్మెల్యే, ప్రధానమంత్రి ప్రోగ్రాం అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాశం కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భోగాపురం ఎయిర్ పోర్ట్ ఓపెనింగ్‌లో భాగంగా అనకాపల్లి అసెంబ్లీ నియోజక వర్గం టిడిపి కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఇన్చార్జి పిలా గోవిందు మరియు అనకాపల్లి నియోజకవర్గం మండల నాయకులు, కార్యకర్తలుతో సమీక్ష సమావేశం నిర్వహించి, నియోజకవర్గం నుంచి వెళ్లే బస్సులు మరియు ప్రోగ్రాం కి వెళ్లే కార్యకర్తలకు మరియు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగ



కుండా భోజనాలు, నీళ్లు తగిన విధంగా ఏర్పాట్లు చేసి ప్రధానమంత్రి భోగాపురం ప్రోగ్రాం ను విజయవంతం చేయాలని కోరినట్లు తెలిపారు.

## 25 లక్షల విలువైన 19 చోరీ మోటార్ సైకిళ్లు స్వాధీనం

**ఇద్దరు నిందితులు అరెస్టు**

బిట్రగుంట ( సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డా. అజితా వెజెండ్ల ఆదేశాల మేరకు, కావలి డీఎస్పీ వి.వి. రమణ కుమార్ పర్యవేక్షణలో, కావలి రూరల్ సీఐ శివశంకర్ సూచనలతో, బిట్రగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా బిట్రగుంట ఎస్ఐ డి. రామకృష్ణ సిబ్బందితో కలిసి మంగళవారం బోగోలు మండలం ఎన్‌హెచ్–16 ముంగ మూరు క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు ఇరగదీన్నెల యువరాజ్ (29), గుంజా సలీం రాజ్ ఏ స్టాలిన్ (19) గా గుర్తించారు. వారి వద్ద లభించిన Honda Unicorn (AP40 LU 8302) మోటార్ సైకిల్‌ను ఈ నెల 13వ తేదీన బోగోలు గ్రామంలో జైహింద్ మెడికల్ షాప్‌లో పనిచేస్తున్న దేవరకొండ అక్షయ్‌ను బెదిరించి అపహరించినట్లు వారు అంగీకరించారు. విచారణను మరింత లోతుగా కొనసాగించగా, నిందితులు తమ సహచరులతో కలిసి వివిధ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లను చోరీ చేసి, బోగోలు మండలం కప్పరాలతిప్ప గ్రామ సమీపంలోని జామాయిల్ తోట వద్ద గుంటలో దాచిపెట్టినట్లు వెల్లడించారు. పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా మొత్తం 19 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 15 Honda Unicorn, 1 Yamaha MT-15, 1 Yamaha FZ, 1 Bajaj Pulsar, 1 TVS Apache ఉన్నాయి. వీటి మొత్తం అంచనా విలువ సుమారు రూ. 25 లక్షలు. ప్రాథమిక విచారణలో వీటిలో 15 వాహనాలు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన చోరీ కేసులకు సంబంధించినవిగా గుర్తించగా, మిగిలిన నాలుగు వాహనాల యాజమాన్యం, కేసులపై విచారణ కొనసాగుతోంది. నిందితులపై నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాలతో పాటు



తమిళనాడు రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లలో కూడా పలు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

నిందితులను చట్టప్రకారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ కేసును అత్యంత సమర్థవంతంగా ఛేదించి, భారీ మొత్తంలో చోరీకి గురైన మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్న బిట్రగుంట ఎస్ఐ డి. రామకృష్ణ మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. అజితా వెజెండ్ల, అభినందించారు.



## వర్క్ పర్మిట్ల నిరాకరణ.. అంతర్జాతీయ విద్యార్థులకు కెనడా తీవ్ర హెచ్చరికలు!

**కెనడాలో పలువురు అంతర్జాతీయ విద్యార్థుల వర్క్ పర్మిట్లు తిరస్కరణ**

**నిబంధనలను ఉల్లంఘించి పని చేయడం చట్టాలను ఉల్లంఘించడమేనన్న కెనడా**

**అనుమతి లేని ఉద్యోగాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక**

కెనడాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులతో సహా పలువురు అంతర్జాతీయ విద్యార్థుల పోస్ట్-గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్లు (గ్రా+పౌ) తిరస్కరణకు గురికావడం, దానికి నిరసనగా విద్యార్థులు ఆందోళనలు చేపట్టడంపై ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (×=జజ) స్పందించింది. విద్యార్థులు చదువుకునే సమయంలో పనిచేయడానికి వర్తించే నిబంధనలపై కీలక స్పష్టతనిస్తూ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. స్టడీ పర్మిట్ నిబంధనలను అతిక్రమించి అనుమతి లేకుండా పనిచేయడం ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘించడమేనని ఐఆర్‌సీసీ స్పష్టం చేసింది. పార్ట్-టైమ్‌గానైనా సరే అనుమతి లేని ఉద్యోగాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. నిబంధనలు పాటించని వారిపై భవిష్యత్తులో ఇచ్చే వర్క్ పర్మిట్లను రద్దు చేయడం, వీసాలు నిరాకరించడం లేదా దేశం నుంచి తిరిగి పంపించివేయడం వంటి కఠిన చర్యలు ఉంటాయని తెలిపింది. కెనడాలోని పోర్టేజ్ కాలేజ్ విద్యార్థుల వర్క్ వీసాలు తిరస్కరణకు గురికావడంతో వారు ఆందోళనలు చేపట్టగా, ఈ అంశంపై న్యాయ సలహా తీసుకోవాలని సదరు కళాశాల యాజమాన్యం సూచించింది. రాబోయే రోజుల్లో విద్యార్థుల ప్రతినిధులతో భేటీ అయి పరిస్థితిని సమీక్షిస్తామని తెలిపింది. కెనడా ప్రభుత్వం విదేశీ విద్యార్థుల సంఖ్యపై, వర్క్ పర్మిట్లపై ఆంక్షలు కఠినతరం చేస్తుండటంతో వేలాది మంది భారతీయ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అనధికారిక ఏజెంట్లు, జాబితాలో లేని కాలేజీల ద్వారా వర్క్ పర్మిట్ పొందాలని ప్రయత్నించవద్దని స్పష్టం చేసింది. తప్పుడు మార్గాలు అనుసరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించింది. అధికారికంగా గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లోనే చేరాలని, వర్క్ పర్మిట్ కోసం సరైన ప్రక్రియలు అనుసరించాలని సూచించింది. ఇటీవలి కాలంలో ఇలాంటి సంఘటనలు పెరగడంతో ఈ అడ్వైజరీ జారీ చేయాల్సి వచ్చింది. భారత విద్యార్థులు కెనడాలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఎంతో మంది వెళ్తున్నారు. కానీ కొంతమంది అనధికారిక ఏజెంట్లు, ఫేక్ కాలేజీల ద్వారా వర్క్ పర్మిట్ పొందాలని ప్రయత్నించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. కెనడా ప్రభుత్వం ఇప్పుడు కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. కెనడాలో మన భారత విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా ఉంది. దీంతో, కెనడా హెచ్చరిక మన విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపబోతోంది.

## పేకాట స్థావరం పై పోలీసులు మెరుపు దాడి



కోట (సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లాలో పేకాట, గ్యాంబ్లింగ్ తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు సోమవారం కోట పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిజనవాడ ప్రాంతంలో నిర్వహించిన ఆకస్మిక దాడిలో పేకాట ఆడుతున్న 6 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దాడిలో వారి వద్ద నుంచి రూ.6,000/- నగదు మరియు 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా పోలీసులు మాట్లాడుతూ, జిల్లాలో పేకాట, మట్కా, గ్యాంబ్లింగ్, కోడిపందేలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే డయల్-112 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 93929 03413కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ దాడిలో కోట పోలీస్ స్టేషన్ ఎస్ఐ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఉప్పు కాల్వలో మృతదేహం లభ్యం

గూడూరు (సింధూర దర్శిని) 28 జూలై నెల్లూరు జిల్లా; ఉప్పు కాల్వలో గుర్తు తెలియని మృతదేహం తెలియాడుతూ కనిపించింది. పోలీసుల వివరాల మేరకు చిల్లకూరు మండల పరిధిలోని మొమిడి గ్రామ పరిధిలోని ఉప్పు కాల్వలో మంగళవారం నీటిపై తేలియాడుతూ మృతదేహం కనిపించిందని. మృతుడు వెంకటాచలం మండలం , దిగువ వెంకట్ రెడ్డి పల్లి గ్రామ నివాసి నడవల నాగరాజు (60) తండ్రి వీరయ్య గౌడ కులానికి చెందిన వ్యక్తిగా గుర్తించడం జరిగిందని, దీనిపై మృతుడు కుమారుడు నడవల శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిల్లకూరు పోలీస్ స్టేషన్ లో కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.



ఫైల్ ఫొటో

# ఏఐలో భారత్ ముందంజ.. అమలులో మాత్రం వెనుకబాటు

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంసిద్ధతలో ప్రపంచ కంపెనీలను మించిన భారత్**

**ఏఐకి అనుగుణంగా ఆఫీసుల్లో మార్పులు చేయడంలో మాత్రం తీవ్ర జాప్యం**

**బడ్జెట్ కాదు, నైపుణ్యాల కొరతే అసలు అడ్డంకి అని తేల్చిన సర్వే**

**ఏఐ వల్ల ఉద్యోగాలు పోవని, మానవ వనరుల విలువ పెరుగుతుందని అంచనా**

**నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెడితేనే భవిష్యత్తు అని జేఎల్ఎల్ నివేదిక స్పష్టీకరణ**



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంసిద్ధత విషయంలో భారత కంపెనీలు ప్రపంచ సగటును మించి దూసుకెళ్తున్నాయని, అయితే ఏఐకి అనుగుణంగా తమ కార్యాలయాలను మార్చుకోవడంలో మాత్రం వెనుకబడి ఉన్నాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఏఐ వల్ల ఆఫీసుల్లో మార్పులు అవసరమని 77 శాతం భారతీయ వ్యాపార నాయకులు గుర్తిస్తున్నప్పటికీ, కేవలం 19 శాతం కంపెనీలు మాత్రమే ఆ దిశగా చర్యలు ప్రారంభించాయి. ఆలోచనకు, ఆచరణకు మధ్య 58 పాయింట్ల భారీ వ్యత్యాసం ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. 21 దేశాల్లో 2,200 మంది సీఈవోలు, సీఎఫ్‌వోలు, రియల్ ఎస్టేట్ హెడ్‌లతో జరిపిన సర్వే ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఏఐ సంబంధిత 8 కీలక కొలమానాల్లోనూ భారత కంపెనీలు ప్రపంచ సగటు కంటే మెరుగైన స్కోరు సాధించాయి. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవని, కొత్త ఉద్యోగాలు వస్తాయని భారత వ్యాపారవేత్తలు బలంగా నమ్ముతున్నారు. రాబోయే 3-5 ఏళ్లలో 58 శాతం మంది తమ సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తుండగా, 62 శాతం మంది ఏఐ వల్ల మానవ వనరుల పాత్ర తొలగిపోదని, పైగా వారి విలువ మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. గత 15 ఏళ్లలో తొలిసారిగా కంపెనీలకు బడ్జెట్ కంటే నైపుణ్యాల కొరతే పెద్ద అడ్డంకిగా మారిందని నివేదిక హైలైట్ చేసింది. 46 శాతం భారతీయ కంపెనీలు నైపుణ్యాల కొరతను ప్రధాన సమస్యగా పేర్కొనగా, కేవలం 35 శాతం మాత్రమే బడ్జెట్‌ను కారణంగా చూపాయి. "ఇది ఒక సానుకూల మలుపు. ఎందుకంటే బడ్జెట్ కేటాయింపుల కోసం వేచిచూడటం కంటే, నైపుణ్యాలను అంతర్గతంగా అభివృద్ధి చేయడం లేదా బయటి నుంచి పొందడం సులభం" అని జేఎల్ఎల్ వర్క్ డైనమిక్స్ అకౌంట్స్ ఎండీ అజిత్ కుమార్ వివరించారు.

ఏఐ ట్రెండ్స్‌ను ట్రాక్ చేయడంలో ప్రపంచ సగటు 46 శాతం ఉండగా, భారత్‌లో 56 శాతం కంపెనీలు ముందున్నాయి. అలాగే ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంలో గ్లోబల్ యావరేజ్ 36 శాతం కాగా, భారత్‌లో 45 శాతంగా ఉంది. రియల్ ఎస్టేట్ కార్యకలాపాల్లో ఏఐ వినియోగంలో 19 శాతం భారత కంపెనీలు అత్యంత ఆధునిక దశకు చేరుకున్నాయని, ఇది ప్రపంచ సగటు 15 శాతం కంటే ఎక్కువని నివేదిక పేర్కొంది. బడ్జెట్ సమస్యగా చూడకుండా, నైపుణ్యాభివృద్ధిని ఒక సవాల్‌గా స్వీకరించి పెట్టుబడులు పెట్టే కంపెనీలే రాబోయే దశాబ్దంలో భారత వర్క్‌ప్లేస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను నిర్దేశిస్తాయని అజిత్ కుమార్ అన్నారు.

# అంతరిక్ష కేంద్రంలో వ్యోమగామి యోగా.. నెటిజన్ల ఫిదా..

**అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో యోగా చేస్తున్న వ్యోమగామి సోఫీ అడెనాట్**

**తన యిన్ యోగా రొటీన్‌కు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న సోఫీ**

**జీరో గ్రావిటీలో యోగాసనాలు చేయడంపై నెటిజన్ల ప్రశంసల వర్షం**

**ప్రతిరోజూ సాయంత్రం 30 నిమిషాలు యోగాతో సేద తీరుతానని వెల్లడి**

**త్వరలో పూర్తిస్థాయి వీడియో రిలీజ్ చేస్తానని తెలిపిన ఆస్ట్రోనాట్**



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో వ్యోమగాముల జీవితం ఎలా ఉంటుందో అప్పుడప్పుడు కొన్ని అరుదైన దృశ్యాలు మనకు కనిపిస్తుంటాయి. తాజాగా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) వ్యోమగామి సోఫీ అడెనాట్, అంతరిక్షంలో తాను యోగా చేస్తున్న వీడియోను పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. భూమ్యాకర్షణ శక్తి లేని (మైక్రోగ్రావిటీ) వాతావరణంలో తేలియాడుతూ ఆమె చేసిన 'యిన్ యోగా' విన్యాసాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భూమిపై ఉన్నప్పుడు చాలా ఏళ్లుగా యోగాను తన దినచర్యలో భాగం చేసుకున్న సోఫీ, అంతరిక్షంలోనూ తన అలవాటును కొనసాగిస్తున్నారు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. "ఒక రోజంతా బిజీగా గడిపిన తర్వాత సేద తీరడానికి ప్రతిరోజూ సాయంత్రం 30 నిమిషాల పాటు యిన్ యోగా చేస్తాను" అని ఆమె పేర్కొన్నారు. సాధారణ యోగాకు, అంతరిక్షంలో చేసే యోగాకు చాలా తేడా ఉంటుంది. యిన్ యోగాలో నెమ్మదిగా, ఎక్కువ సమయం పాటు సాగదీసే ఆసనాలు ఉంటాయి. అయితే, జీరో గ్రావిటీ వల్ల శరీరానికి పట్టు దొరకదు. దీంతో ఆసనాలు వేయడం చాలా కష్టం. ఈ సవాలును అధిగమించేందుకు సోఫీ అంతరిక్ష కేంద్రం లోని గోడలకు ఉన్న హ్యాండిల్స్, పాదాలకు ప్రత్యేకమైన పట్టీలు, అలాగే శరీర నియంత్రణ (కోర్‌కంట్రోల్) వంటి వాటిని ఉపయోగించు కుంటున్నారు. దీని ద్వారా కండరాలకు అవసరమైన స్ట్రెచింగ్ సాధ్యమవుతోంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు ఆనందం వ్యక్తం చేస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. "స్పేస్ యోగా చూడటానికి అద్భుతంగా, ఎంతో అందంగా ఉంది" అని ఒక యూజర్ కామెంట్ చేయగా, "భూమికి సంబంధం లేకుండా ఆసనాలు వేస్తే ఎలా ఉంటుందో తెలుసుకోవాలని ఉంది" అని మరో యూజర్ తన ఆసక్తిని పంచుకున్నారు. "సైన్స్, కళ, వినోదం.. అన్నీ ఒకేచోట చూపించి మాలో స్ఫూర్తి నింపుతున్నారు" అంటూ మరికొందరు ఆమెను ప్రశంసించారు.

అంతరిక్షంలో మానవ శరీరం ఎలా స్పందిస్తుంది, యోగా టెక్నిక్స్‌ను ఎలా మార్చుకోవాలి అనే అంశాలపై త్వరలోనే ఒక పూర్తిస్థాయి వీడియోను విడుదల చేస్తానని సోఫీ అడెనాట్ తెలిపారు. వ్యోమగాములు కేవలం శాస్త్రీయ ప్రయోగాలకే పరిమితం కాకుండా తమ మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇలాంటి పద్ధతులు పాటిస్తారని ఈ వీడియో స్పష్టం చేస్తోంది.

# మధ్యాహ్న భోజనానికి ముందు మెంతి మొలకలు... షుగర్ నియంత్రణకు సహజ చిట్కా!

**భోజనానికి ముందు మెంతి మొలకలతో ప్రయోజనమంటున్న నిపుణులు**

**షుగర్ స్పైక్స్ తగ్గించడంలో తోడ్పాటు**

**సమృద్ధిగా పీచు, యాంటీ ఆక్సిడెంట్లు**

**ఇన్సులిన్ పనితీరుకు మద్దతు**

**ఇంట్లోనే సులభంగా తయారీ**

**మందులకు ప్రత్యామ్నాయం కాదన్న నిపుణులు**



మధుమేహం ఇప్పుడు ప్రతి ఇంట్లో వినిపిస్తున్న ఆరోగ్య సమస్య. మందులు, వ్యాయామం ఎంత ముఖ్యమో.. రోజువారీ ఆహారం కూడా అంతే కీలకం. ఏం తింటున్నామనేది మాత్రమే కాదు, ఎప్పుడు తింటున్నామన్నదీ రక్తంలో చక్కెర స్థాయులపై ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో భోజనానికి ముందు మొలకెత్తిన మెంతులు తినడం వల్ల షుగర్ ఒక్కసారిగా పెరగకుండా కొంత వరకు నియంత్రించవచ్చని పలు పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే ఇది అద్భుత ఔషధం కాదని, ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా మాత్రమే చూడాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### మొలకలతో పోషక విలువ

సాధారణ మెంతులతో పోలిస్తే మొలకెత్తిన మెంతుల్లో పోషకాలు శరీరానికి సులభంగా అందుతాయి. మొలకలు వచ్చిన తర్వాత యాంటీ ఆక్సిడెంట్లు పెరుగుతాయి. జీర్ణం కూడా సులభమవుతుంది. ఖనిజాలు, ప్లాంట్ ప్రొటీన్లు, పీచు పదార్థాలు సమృద్ధిగా లభిస్తాయి. అందుకే వీటిని సాధారణ గింజల కంటే మరింత ప్రయోజనకరంగా భావిస్తున్నారు.

### షుగర్ నియంత్రణకు ఎలా తోడ్పడతాయి?

మొలకెత్తిన మెంతుల్లో కరిగే పీచు ఎక్కువగా ఉంటుంది. ఇది కార్బోహైడ్రేట్లు నెమ్మదిగా జీర్ణమయ్యేలా చేస్తుంది. ఫలితంగా భోజనం తర్వాత రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరిగే అవకాశం తగ్గుతుంది. గ్యాలాక్టోమన్నాన్, 4-హైడ్రాక్సీ ఐసోల్యూసిన్ వంటి సహజ పదార్థాలు గ్లూకోజ్‌ను శరీరం గ్రహించే వేగాన్ని తగ్గించడంలో, ఇన్సులిన్ పనితీరుకు తోడ్పడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

### భోజనానికి ముందే ఎందుకు తినాలి?

మధ్యాహ్న భోజనానికి ముందు కొద్దిపాటి మెంతి మొలకలు తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో అతిగా తినే అలవాటు తగ్గే అవకాశం ఉంటుంది. ఆహారం నెమ్మదిగా జీర్ణమవడం వల్ల ఎనర్జీ లెవెల్స్ స్థిరంగా ఉండేందుకు కూడా తోడ్పడొచ్చు. జీర్ణక్రియ, గట్ హెల్త్‌కు కూడా ఇవి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

### ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు

మెంతులను రాత్రంతా నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు నీరు వంపేసి శుభ్రమైన పలుచని వస్త్రంలో కట్టాలి. 24 నుంచి 48 గంటల్లో మొలకలు వస్తాయి. ఈ సమయంలో తేమ ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. లేకపోతే బ్యాక్టీరియా పెరిగే ప్రమాదం ఉంటుంది. మొలకలు వచ్చిన వెంటనే తాజాగా తీసుకోవడం మంచిది.

### అందరికీ పడకపోవచ్చు

మధుమేహానికి మందులు వాడేవారు వైద్యుల సలహాతోనే మెంతి మొలకలను ఆహారంలో చేర్చుకోవాలి. ఎందుకంటే రక్తంలో చక్కెర మరీ ఎక్కువగా తగ్గే అవకాశం ఉంటుంది. గర్భిణులు, జీర్ణ సమస్యలు ఉన్నవారు కూడా వైద్యులను సంప్రదించడం మంచిది. మెంతి మొలకలు ఆరోగ్యకరమైన ఆహారంలో భాగమే తప్ప, మందులకు ప్రత్యామ్నాయం కావని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సమతుల ఆహారం, వ్యాయామం, వైద్యుడు సూచించిన చికిత్స కొనసాగిస్తేనే పూర్తి ప్రయోజనం ఉంటుంది.

# కేంద్రం లెక్కల్లో ఏపీ ఘనత.. పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో అద్భుతమైన ప్రగతి

2025-26లో 3,865 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి - గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్లు అధికం

లోక్‌సభలో వివరాలను వెల్లడించిన కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ - ప్రభుత్వ విధానాలతోనే ఈ అపూర్వమైన వృద్ధి సాధ్యమైందని వెల్లడి

2029 నాటికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం



పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ అద్భుతమైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం ఏకంగా 3,865.63 మెగావాట్ల మేర కొత్త ఇంధన సామర్థ్యాన్ని జోడించింది. ఈ విషయాన్ని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడించింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్ల పెరుగుదల కావడం గమనార్హం. తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ ఎం.కె. విష్ణు ప్రసాద్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ఈ గణాంకాలను పార్లమెంటు ముందు ఉంచింది. ఈ లెక్కల ప్రకారం.. 2024-25లో ఏపీలో 1,085.15 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం జతకాగా, 2025-26లో అది అనూహ్యంగా 3,865.63 మెగావాట్లకు చేరింది. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రంగంలో అపూర్వమైన వృద్ధి నమోదైందని, దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న పునరుత్పాదక ఇంధన గమ్యస్థానాల్లో ఒకటిగా ఏపీ నిలిచిందని అధికారిక ప్రకటన పేర్కొంది. గత కొన్నేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ పురోగతి స్పష్టంగా కనిపిస్తుంది. 2021-22లో 125.42 మెగావాట్లు, 2022-23లో 148.62 మెగావాట్లు, 2023-24లో కేవలం 59.15 మెగావాట్ల సామర్థ్యం మాత్రమే పెరిగింది. అయితే, 2024-25 నుంచి ఊపందుకుని 1 గిగావాట్ (1000 మెగావాట్లు) దాటిన వృద్ధి, తాజాగా దాదాపు 3.9 గిగావాట్లకు చేరడం రాష్ట్రంలో ఈ రంగం పుంజుకుందనడానికి నిదర్శనం.

పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, ప్రాజెక్టులకు వేగవంతమైన అనుమతులు, మెరుగైన అమలు, పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టడం వంటివి ఈ వృద్ధికి కీలక కారణాలని అధికారిక ప్రకటన వివరించింది.


ఈ ఏడాది మేలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ' అమలును కూడా వేగవంతం చేసింది. ఈ విధానం కింద 2029 నాటికి పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ నిల్వ, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, తయారీ రంగాల్లో ఏకంగా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా కూడా శిలాజయేతర ఇంధన వనరుల నుంచి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ కీలక మైలురాయిని దాటిందని కేంద్రం పార్లమెంటుకు తెలియజేసింది. 2030 నాటికి నిర్దేశించుకున్న 50 శాతం లక్ష్యాన్ని ఐదేళ్ల ముందే సాధించిందని, 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజయేతర ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యాన్ని సాధించే దిశగా దేశం పయనిస్తోందని పేర్కొంది. ఈ జాతీయ లక్ష్యాలను చేరుకోవడంలో ఏపీ తన వంతు కీలక పాత్ర పోషిస్తోంది. ఈ రంగంలో భారీ వృద్ధి ద్వారా రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు సుస్థిర ఆర్థిక వృద్ధికి మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు.

# చంద్రుడి గుంతల వెనుక అసలు కథ ఇదే.. కొత్త అధ్యయనంలో ఆసక్తికర విషయాలు

చంద్రుడి గుంతలపై కొత్త అధ్యయనం - చాంగ్‌ఈ-6 నమూనాల విశ్లేషణ

గ్రహశకలాలు ఢీకొనడం క్రమంగా తగ్గినట్లు గుర్తింపు - 'లేట్ హెవీ బాంబార్డ్‌మెంట్' సిద్ధాంతానికి సవాల్

చంద్రుణ్ని 'టైమ్ క్యాప్సూల్'గా పేర్కొన్న శాస్త్రవేత్తలు - భూమిపై జీవం ఆవిర్భావంపై కొత్త ఆధారాలకు ఆశ



రాత్రివేళ ఆకాశంలో కనిపించే చంద్రుణ్ని గమనిస్తే పెద్ద పెద్ద మచ్చలు స్పష్టంగా కనిపిస్తాయి. అయితే అవన్నీ గుంతలు అనే విషయం శాస్త్రవేత్తలు ఎప్పుడో తేల్చారు. అయితే అవి ఎలా ఏర్పడ్డాయి? ఎందుకు అన్ని గుంతలు ఉన్నాయి? అనే ప్రశ్నకు శాస్త్రవేత్తలు తాజాగా కొత్త సమాధానం కనుగొన్నారు. చంద్రుడి అవతలి వైపు నుంచి చైనా తీసుకొచ్చిన రాతి నమూనాలపై నిర్వహించిన అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పరిశోధన సౌర కుటుంబం తొలి దశ చరిత్రపై కొత్త అవగాహన కల్పిస్తోంది. చంద్రుడిపై కనిపించే గుంతల చరిత్రపై కొత్త ఆధారాలు లభించాయి. భూమిపై గాలి, వర్షం, అగ్నిపర్వతాలు, భూకంపాల వంటి ప్రకృతి మార్పుల వల్ల పురాతన ఆనవాళ్లు చెరిగిపోతుంటాయి. కానీ చంద్రుడిపై అలాంటి మార్పులు చాలా తక్కువగా ఉండటంతో గ్రహశకలాలు, తోకచుక్కలు ఢీకొన్న ప్రతిసారి ఏర్పడిన గుంతలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. అందుకే చంద్రుణ్ని గత చరిత్రను భద్రపరిచిన 'టైమ్ క్యాప్సూల్'గా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. చైనా చేపట్టిన చాంగ్‌ఈ-6 మిషన్ చంద్రుడి అవతలి వైపు నుంచి రాతి నమూనాలను భూమికి తీసుకొచ్చింది. వాటిని పరిశీలించిన శాస్త్రవేత్తలు.. గతంలో భావించినట్లు ఒకేసారి భారీ సంఖ్యలో గ్రహశకలాలు ఢీకొనలేదని తేల్చారు. బిలియన్ల ఏళ్ల పాటు క్రమంగా ఢీకొట్టే ఘటనలు తగ్గుతూ వచ్చాయని గుర్తించారు. పరిశోధకులు 4.33 బిలియన్ నుంచి 1.13 బిలియన్ సంవత్సరాల నాటి రాతి నమూనాలను విశ్లేషించారు. ఈ అధ్యయనం ప్రకారం ఒకప్పుడు భావించిన 'లేట్ హెవీ బంబార్డ్‌మెంట్' సిద్ధాంతానికి భిన్నమైన ఆధారాలు లభించాయి. సుమారు 4 బిలియన్ సంవత్సరాల క్రితం ఒక్కసారిగా భారీ స్థాయిలో ఢీకొన్న ఘటనలకన్నా, కాలక్రమేణా వాటి సంఖ్య తగ్గుతూ వచ్చిందని వెల్లడైంది. ఈ పరిశోధన భూమి చరిత్రను అర్థం చేసుకోవడంలో కూడా ఉపయోగపడనుంది. భూమి, చంద్రుడు రెండూ దాదాపు 4.5 బిలియన్ సంవత్సరాల క్రితం ఒకే సమయంలో ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందువల్ల చంద్రుడిని గ్రహశకలాలు ఢీకొట్టిన ఘటనలు.. అప్పటి భూమిపై కూడా ఎలాంటి పరిస్థితులు ఉండేవో అంచనా వేయడానికి దోహదపడతాయని భావిస్తున్నారు. భూమిపై జీవం ఆవిర్భావానికి ఈ ఘటనలు ఏమైనా కారణమయ్యాయా అనే అంశంపై కూడా మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.

# ఏళ్ల నాటి సౌర రహస్యం.. సూర్యుడిలో 'తప్పిపోయిన' వెండి గుట్టు వీడింది!

ఏళ్లుగా అంతుచిక్కని సూర్యుడి రహస్యాన్ని ఛేదించిన పరిశోధకులు

సూర్యుడిలో వెండి తక్కువగా లేదని తాజా అధ్యయనంలో వెల్లడి

కాంతి ప్రవర్తన వల్లే వెండి పరిమాణం తక్కువగా కనిపించిందని నిర్ధారణ

అనుకున్న దానికంటే సూర్యుడిలో 55 శాతం ఎక్కువ వెండి ఉన్నట్లు అంచనా

సూపర్ కంప్యూటర్ సిమ్యులేషన్ల ద్వారా ఈ కొత్త విషయాన్ని కనుగొన్న పరిశోధకులు



మన సౌర కుటుంబానికి కేంద్రమైన సూర్యుడికి సంబంధించి ఏళ్లుగా శాస్త్రవేత్తలను వేధిస్తున్న ఓ పెద్ద మిస్టరీకి తెరపడింది. సూర్యుడిలో వెండి పరిమాణం అనుకున్న దానికంటే చాలా తక్కువగా ఉందని ఇప్పటివరకు భావించారు. అయితే, ఆ వెండి ఎక్కడికీ పోలేదని, కాంతి ప్రవర్తనలో ఉన్న సంక్లిష్టతల కారణంగా అది మన కంటికి కనిపించకుండా 'దాక్కుంది' అని తాజా పరిశోధనలో తేలింది. ఈ ఆవిష్కరణ ఖగోళ శాస్త్రంలో సూర్యుడిపై మనకున్న అవగాహనను మరింత మెరుగుపరచనుంది. 'ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్' అనే ప్రముఖ సైన్స్ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలను ప్రచురించారు. వాస్తవానికి సూర్యుడిలో 98.5 శాతం హైడ్రోజన్, హీలియం వాయువులే ఉంటాయి. అయితే, వెండి లాంటి భార లోహాలు చాలా స్వల్ప పరిమాణంలో ఉన్నప్పటికీ, వాటిని అధ్యయనం చేయడం ద్వారా నక్షత్రాలు, గెలాక్సీల పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవచ్చనేది శాస్త్రవేత్తల మాట. సూపర్‌నోవా పేలుళ్ల వంటి భారీ ఖగోళ సంఘటనల సమయంలో వెండి ఏర్పడుతుందని భావిస్తున్నారు. బెల్జియంలోని లీజ్ యూనివర్సిటీ పరిశోధకురాలు, ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన సేమా కాలిస్కాన్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. సుమారు 460 కోట్ల సంవత్సరాల క్రితం సూర్యుడు ఏర్పడిన పదార్థంతోనే పురాతన సీఐ కాండ్రైట్ ఉల్కలు కూడా ఏర్పడ్డాయి. కాబట్టి ఆ ఉల్కలలో ఉన్న వెండి పరిమాణమే సూర్యుడిలోనూ ఉండాలని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. కానీ, సూర్యుడి నుంచి వెలువడే కాంతిని విశ్లేషించిన ప్రతిసారీ వెండి స్థాయిలు చాలా తక్కువగా కనిపించాయి. ఈ రహస్యాన్ని ఛేదించడానికి కాలిస్కాన్ బృందం స్వీడన్‌లోని టెట్రాలిత్ సూపర్‌కంప్యూటర్‌ను ఉపయోగించి వెండి అణువులపై అత్యంత అధునాతన సిమ్యులేషన్లు నిర్వహించింది. గత అధ్యయనాలకు భిన్నంగా ఈ కొత్త నమూనాలో కాంతిని గ్రహించే విషయంలో అణువుల ప్రవర్తనపై ప్రభావం చూపే 'నాన్-ఈక్విలిబ్రియం ఎఫెక్ట్స్' అనే సంక్లిష్ట భౌతిక ప్రభావాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ప్రభావాల వల్లే వెండి పరిమాణం తక్కువగా నమోదైందని వారి సిమ్యులేషన్లు స్పష్టం చేశాయి. దీని ఆధారంగా మునుపటి అంచనాల కంటే సూర్యుడిలో సుమారు 55 శాతం ఎక్కువ వెండి ఉందని పరిశోధకులు నిర్ధారించారు. ఈ కొత్త లెక్క ఉల్కల్లోని వెండి స్థాయిలకు పూర్తిగా సరిపోలకపోయినా, చాలా దగ్గరగా ఉంది. దీంతో సూర్యుడిలో వెండి నిజంగా తక్కువగా ఉందనే వాదనకు బలం లేదని, అది కేవలం భౌతికశాస్త్ర ప్రభావాల వల్ల కనిపించని ఒక మాయ మాత్రమేనని స్పష్టమైంది.

# ఆ కుర్రాడిది బ్రాడ్‌మన్ టెక్నిక్..

అతడిని ఔట్ చేయడం కష్టం: వైభవ్‌పై ఊతప్ప ఆసక్తికర వ్యాఖ్యలు

టీమిండియా యువ బ్యాటర్ సూర్యవంశీని డాన్ బ్రాడ్‌మన్‌తో పోల్చిన రాబిన్ ఊతప్ప

బ్రాడ్‌మన్‌లాగే వైభవ్‌ను కూడా ఎల్‌బీడబ్ల్యూ ఔట్ చేయడం చాలా కష్టమని వ్యాఖ్య

బౌలర్లు అతడిపై ఎక్కువగా బాడీలైన్ బౌలింగ్ ప్రయోగిస్తున్నారని విశ్లేషణ

అధిక స్ట్రైక్‌రేట్‌తో ఇదే ఫామ్ కొనసాగిస్తే వైభవ్ ఒక 'అవుట్‌లయర్' అవుతాడని అభిప్రాయం

ధోనీలాగే తన సహజ శైలితో ఆడుతూ వైభవ్ ప్రత్యేకంగా నిలుస్తున్నాడని ప్రశంస



భారత క్రికెట్‌లో ప్రస్తుతం ఓ యువ సంచలనం పేరు మారుమోగిపోతోంది. అతడే వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన ఈ టీనేజ్ బ్యాటర్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆటగాడు, ఐపీఎల్ విజేత రాబిన్ ఊతప్ప.. వైభవ్ బ్యాటింగ్ శైలిని ఏకంగా క్రికెట్ దిగ్గజం సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్‌తో పోల్చి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన ఊతప్ప, వైభవ్ బ్యాటింగ్ టెక్నిక్‌లో బ్రాడ్‌మన్ ఛాయలు కనిపిస్తున్నాయని విశ్లేషించాడు. "బ్రాడ్‌మన్ ఆడుతున్నప్పుడు అతడిని కట్టడి చేసేందుకు బౌలర్లు బాడీలైన్ బౌలింగ్ ప్రయోగించేవారు. ఇప్పుడు వైభవ్ విషయంలోనూ అదే జరుగుతోంది. వీరిద్దరి టెక్నిక్‌లో ఒకేరకమైన పోలిక ఉంది. బ్రాడ్‌మన్‌లాగే వైభవ్‌ను కూడా ఎల్‌బీడబ్ల్యూగా ఔట్ చేయడం దాదాపు అసాధ్యం" అని ఊతప్ప వివరించాడు. వైభవ్ కెరీర్ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, బౌలర్లు అతడిని ఎదుర్కోవడానికి ఇదే వ్యూహాన్ని అనుసరిస్తున్నారని పేర్కొన్నాడు. అయితే, ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుందని ఊతప్ప అభిప్రాయపడ్డాడు. "బౌలర్లు వైభవ్ బ్యాటింగ్‌కు ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రస్తుతానికి అతని ఆటతీరును అందరూ అర్థం చేసుకుంటున్నారు. వైభవ్ తన అద్భుతమైన స్ట్రైక్‌రేట్‌తో పాటు 40లలో బ్యాటింగ్ సగటును కొనసాగించగలిగితే, అతడు కచ్చితంగా ఒక 'అవుట్‌లయర్' (సాధారణ పద్ధతులకు భిన్నంగా అద్భుతంగా రాణించే ఆటగాడు) అవుతాడు" అని అన్నారు. ఆధునిక క్రికెట్‌లో సాంప్రదాయ పద్ధతులకు భిన్నమైన ఆటగాళ్లు ఎక్కువగా రాణిస్తున్నారని ఊతప్ప తెలిపాడు. "ఇప్పుడు ఆటగాళ్లు సహజసిద్ధమైన ప్రతిభపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. అందుకే ఎంఎస్ ధోనీ తనదైన శైలితో విజయవంతమయ్యాడు. ఇప్పుడు వైభవ్ కూడా అదే చేస్తున్నాడు. భిన్నమైన టెక్నిక్‌లు ఇప్పుడు ఆమోదయోగ్యంగా మారాయి. అదే సమయంలో సచిన్ టెండూల్కర్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ వంటి వారి సంప్రదాయబద్ధమైన ఆటను కూడా మనం ఆస్వాదిస్తాం" అని ఊతప్ప చెప్పుకొచ్చాడు.

# 300 ఏళ్ల పురాతన ఫిరంగి అపహరణ.. డ్యామ్‌ను పేల్చే కుట్ర?

-రాజస్థాన్‌లోని నార్వార్ కోట నుంచి ఫిరంగి అపహరణ

-అంతర్జాతీయ మార్కెట్లో కోట్ల విలువ ఉంటుందని అంచనా

-ప్రాజెక్టు డ్యామ్‌ను పేల్చే కుట్ర కోణంలోనూ విచారణ

-ఫిరంగి కోసం రాజస్థాన్‌లో జేసీబీలతో విస్తృత గాలింపు



దాదాపు 300 ఏళ్ల చారిత్రక నార్వార్ కోట నుంచి అపహరణకు గురైన పురాతన ఫిరంగి కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. అయితే, చోరీకి గురైన ఫిరంగి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. దాని కోసం రాజస్థాన్‌లోని కరౌలి జిల్లాలో విస్తృత గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శివపురి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సైబర్ సెల్ ట్రాకింగ్, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులు ప్రయాణించిన మార్గాన్ని గుర్తించారు. దర్యాప్తులో భాగంగా రాజస్థాన్‌లోని కరౌలి జిల్లాకు చెందిన అమన్, టిమ్ రామ్‌లను అరెస్ట్ చేశారు. నిందితులు ఫిరంగిని తరలించడానికి ఉపయోగించిన బొలెరో వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు ఈ ఫిరంగిని దొంగిలించడానికి రెండుసార్లు ప్రయత్నించినట్లు తేలింది. జులై 5న తొలిసారి ప్రయత్నించగా, అది చాలా బరువుగా ఉండటంతో విఫలమయ్యారు. అనంతరం 15న రెండో ప్రయత్నంలో దాన్ని అపహరించారు. అష్టధాతువులతో తయారు చేసిన ఈ ఫిరంగికి అంతర్జాతీయ మార్కెట్లో కోట్ల రూపాయల విలువ ఉంటుందని, అందుకే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అయితే, ఈ కేసులో మరో సంచలన కోణం కూడా వెలుగులోకి వచ్చింది. కరౌలిలోని పాంచనా డ్యామ్‌కు సంబంధించిన వివాదంలో భాగంగా, ఆ డ్యామ్‌ను ధ్వంసం చేసే కుట్రతో ఈ ఫిరంగిని దొంగిలించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఆరోపణలపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. ప్రస్తుతం శివపురి, రాజస్థాన్ పోలీసులు సంయుక్తంగా జేసీబీలు, మెటల్ డిటెక్టర్ల సహాయంతో అనుమానిత ప్రదేశాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఫిరంగిని గుర్తించడంతో పాటు, ఈ నేరంలో ప్రమేయం ఉన్న మరికొందరి కోసం దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# సినిమా న్యూస్

## ‘చిన్న చిన్న ఆశై’ మూవీ రివ్యూ!



మధుబాల – ఇంద్రన్స్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే ‘చిన్న చిన్న ఆశై’. వర్ష వాసుదేవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, జూన్ 19వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ రోజు (జులై 28వ తేదీ) నుంచి తమిళ .. మలయాళ భాషలతో పాటు తెలుగులోనూ ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. గతంలో మధుబాల కథానాయికగా నటించిన ‘రోజా’ సినిమాలోని పాట నుంచి వచ్చిన టైటిల్ కావడం అందరిలో ఆసక్తిని రేకెత్తించింది.

‘వారణాసి’లో మాధవన్ మాస్టారు (ఇంద్రన్స్) కూతురు జానకి (అపర్ణ బాలమురళి) చదువుకుంటూ సంప్రదాయ నృత్యాన్ని నేర్చుకుంటూ ఉంటుంది. ఆమెను చూడటం కోసం కేరళ నుంచి అప్పుడప్పుడు అతను వచ్చి వెళుతుంటాడు. అలా వారణాసి వచ్చిన అతనికి, భయంతో ఒంటరిగా మిగిలిపోయిన ఒక మహిళ కనిపిస్తుంది. తన పేరు ‘లీల’ (మధుబాల) అని ఆమె అతనితో చెబుతుంది. ‘తంజావూరు’ నుంచి తామంతా ఒక బృందంగా వచ్చినట్టు చెబుతుంది.

‘లీల’ సెల్ ఫోన్ .. ఆమె ‘పర్స్’ ను దొంగ కాజేశాడనీ, అతనిని వెంబడించే ప్రయత్నంలో ఆమె తన బృందం నుంచి తప్పిపోయిందని మాధవన్ అర్థం చేసుకుంటాడు. తప్పిపోయినవారి సమాచారాన్ని అందించే కేంద్రంలో ‘లీల’ పేరు రాయించిన మాధవన్, ఆమె కోసం ఎవరైనా వస్తే తనకి కాల్ చేయమని చెప్పి తన సెల్ నెంబర్ ఇస్తాడు. భయపడవలసిన పనిలేదనీ, తంజావూరు టీమ్ తో కలిసి తిరిగి వెళ్లిపోవచ్చని ఆమెకి మాధవన్ ధైర్యం చెబుతాడు.

మొదట్లో కాస్త భయపడినప్పటికీ, ఆ తరువాత ఆమె తన గురించిన వివరాలను అతనికి చెబుతుంది. అతను కూడా తన భార్య తనకి శాశ్వతంగా దూరమైపోయిందంటూ తన కథను వివరిస్తాడు. లీలకి వారణాసి చూడాలని ఉందని తెలుసుకున్న మాధవన్, ఆమెను వెంటబెట్టుకుని ఆ చుట్టుపక్కల ప్రదేశాలు చూపిస్తాడు. ఆ సమయంలో వారికి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి? ఆ పరిచయం వారి జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది మిగతా కథ.

జీవితం సమస్యలతో సతమతం చేసినప్పుడు .. విధి ఒంటరిని చేసి నిలబెట్టినప్పుడు ఆ మనసు ప్రశాంతతను కోరుకుంటుంది. స్వచ్ఛమైన మరో మనసు తోడును కోరుకుంటుంది. అలాంటి తోడు దొరికినప్పుడు ప్రతి చిన్న సంఘటన ఒక అందమైన జ్ఞాపకంగా మారిపోతూ ఉంటుంది .. గుండె గదులను అనుభూతిగా హత్తుకుపోతూ ఉంటుంది. అలాంటి రెండు ఒంటరి మనుషుల కథ ఇది .. ఒంటరి మనసుల కథ ఇది.

జీవితం ఒక మోడుగా మారిపోయిందని నిరాశపడి పోయిన ‘లీల’ .. ఒంటరి తనాన్ని మరిచిపోవడం కోసం ఆనందాన్ని వెతుక్కునే మాధవన్, ‘వారణాసి’లో అనుకోకుండా కలుసుకుంటారు. వేదాంతం .. వైరాగ్యం అడగకుండానే అనుభవంలోకి వచ్చే దృశ్యాల మధ్య, జీవితం చేసిన గాయాలను వాళ్లిద్దరూ పంచుకుంటారు. చిన్న చిన్న ఆశలను నెరవేర్చుకోవడానికి పెద్దగా సమయాన్ని కేటాయించవలసిన పనిలేదని భావించే ఇద్దరు మనుషుల చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు.

వారణాసిలో .. ఒకే ఒక రోజులో జరిగే పరిచయం రెండు మనసులను ఎంతగా ప్రభావితం చేస్తుంది .. ఎంతగా ఊరట కలిగిస్తుందనేది దర్శకుడు ఆవిష్కరిస్తూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. అయితే ఫీల్ కోసం కేటాయించిన సమయం, ఆడియన్స్‌కి సాగతీతగా అనిపిస్తుంది. సన్నివేశాలు మరీ నిదానంగా సాగుతున్న భావన కలుగుతుంది. చివర్లో వచ్చే ట్విస్ట్ మనసును తాకుతుంది.

ఇంద్రన్స్ నటనకు వంకబెట్టవలసిన పనిలేదు. ఇక మధుబాల దగ్గరికి వచ్చేసరికి, ఆమె పాత్రను డిజైన్ చేసిన తీరు కాస్త అయోమయంలో పడేస్తుంది. ఆమె ఎక్స్ ప్రెషన్స్ లోని ఆంతర్యం ఏమిటనే కన్ఫ్యూజన్ ప్రేక్షకులకు ఉండిపోతుంది. ప్రధానమైన పాత్రలకు తారసపడే రెండు మూడు పాత్రలు కూడా విషయం లేనివిగానే అనిపిస్తాయి. అపర్ణ బాలమురళి పై చిత్రీకరించిన పాట ప్రత్యేక ఆకర్షణగా చెప్పుకోవచ్చు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదనిపిస్తాయి.

జీవితంలో ఓడిపోయినప్పుడు.. ఒంటరిగా మిగిలిపోయిన ప్పుడు ప్రతి మనసు ఒక తోడును కోరుకుంటుంది. అలాంటి ఒక పరిచయం జరిగితే అది శాశ్వతంగా నిలిచిపోవాలని ఆశపడుతుంది. కరిగే కాలం ఆ కోరికను మన్నిస్తుందా? లేదా? అనే ఒక సందేహానికి సమాధానంగా ఈ కథ నడుస్తుంది. ఫీల్ ఉన్నప్పటికీ.. కథనం మరీ నిదానించినట్టుగా అనిపిస్తుంది.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: చిన్న చిన్న ఆసై

విడుదల తేదీ: 2026-07-28

తారాగణం: మధుబాల, ఇంద్రన్స్, అపర్ణ బాలమురళి, విష్ణు అగస్త్య, తంబి రామయ్య

దర్శకుడు: వర్షా వాసుదేవ్


సంగీతం: గోవింద్ వసంత

బ్యానర్: బాబూజీ ప్రొడక్షన్స్

సమీక్ష: పెద్దింటి

చిన్న చిన్న ఆసై రేటింగ్: 5కి 2.25

## ‘ఆదర్శ కుటుంబం’లో నివేదా పేతురాజ్..



విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం’ సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, “ఆడది అంటే ఇలా నవ్వాలి” అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి “ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం” అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది.

ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.



క్రీమ్ చీరలో స్టైల్ ని చంపిన ప్రియదర్శిని ఛటర్జీ అందమైన మోడల్ మరియు మిస్ ఇండియా 2016 విజేత ప్రియదర్శిని ఛటర్జీ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన ఒక అందమైన చిత్రాన్ని పంచుకున్నారు.

## స్టన్నింగ్ మేకోవర్: అగ్గి రాజేసిన రాశీ ఖన్నా



టాలీవుడ్, బాలీవుడ్‌లలో తనదైన నటన – గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక రాశీ ఖన్నా. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ అందాల భామ... తన లేటెస్ట్ ఫొటోషూట్‌లతో అభిమానులను అలరిస్తుంటుంది. తాజాగా రాశీ తన ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసిన బ్లాక్ అండ్ బోల్డ్ లుక్ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. నలుపు రంగు దుస్తుల్లో రాశీ ఖన్నా ఒలికించిన సొగసులు అభిమానులను, నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రత్యేకమైన ఫొటోషూట్ కోసం ఈ దిల్లీ బ్యూటీ ధరించిన అవుట్‌ఫిట్... మేకప్ తన అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఫర్ యువర్ రిఫరెన్స్! అనే క్యాప్షన్‌తో పాటు తన స్టైలిస్ట్ శీఫా జే గిలానీ, మేకప్, హెయిర్ అండ్ ఫొటోగ్రఫీ టీమ్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ -టేక్స్ ఏ విలేజ్-అని పోస్ట్ చేశారు. బ్లాక్ డ్రెస్‌లో రాజసం ఉట్టిపడేలా రాశీ ఇచ్చిన ఫోజులు, స్టైలింగ్ న భూతో నభవిష్యతి అన్నట్లుగా ఉన్నాయని అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఫొటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందాల రాశీఖన్నా అభిమానులు, నెటిజన్లు వేల సంఖ్యలో లైకులు, కామెంట్లతో రీ-పోస్ట్‌లు చేస్తున్నారు. -నలుపు రంగు ఇంత అందంగా ఎప్పుడూ లేదు-, -బాలీవుడ్, టాలీవుడ్‌లలో ఒక కొత్త సంచలనం-,-10 అవుట్ ఆఫ్ 10- అంటూ నెటిజన్లు కామెంట్ల సెక్షన్‌లో హార్ట్, ఫైర్ ఎమోజీలతో రాశీ గ్లామర్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు. గత కొన్ని రోజులుగా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన యాక్టింగ్ స్కిల్స్‌తో మెప్పిస్తున్న రాశీ ఖన్నా, ఇలాంటి ఫ్యాషన్ షూట్స్‌తో తన గ్లామర్ కోణాన్ని కూడా ఆవిష్కరిస్తోంది. ట్రెండ్‌కు తగ్గట్లుగా పర్ఫెక్ట్ ఫ్యాషన్ సెన్స్‌తో కనిపిస్తూ కుర్రకారు హృదయాలను కొల్లగొడుతోంది. ముఖ్యంగా యువతలోఈ బ్యూటీకి ఉన్న క్రేజ్ ఈ ఫొటోలకు వస్తున్న రెస్పాన్స్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. ప్రస్తుతం రాశీ ఖన్నా చేతిలో పలు ఆసక్తికరమైన సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఉన్నాయి. ఒకవైపు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తూనే, మరోవైపు గ్లామరస్ పాత్రలతో అలరిస్తున్న ఈ భామ మునుముందు మరిన్ని భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం -తలాఖోన్ మే ఏక్- అనే బాలీవుడ్ చిత్రంలో నటిస్తోంది. విక్రాంత్ మాస్సేతో రాశీకి ఇది రెండో చిత్రం. ఇది ఒక గ్రిప్పింగ్ డ్రామాగా రూపొందుతోంది. ఆర్. మాధవన్, సోహా అలీ ఖాన్‌లతో కలిసి రాశీ నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ -బ్రిడ్జ్- యూకే నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. అక్షయ్ కుమార్, విద్యాబాలన్‌లతో కలిసి అనీస్ బజ్మీ రూపొందించనున్న కామెడీ ఎంటర్‌టైనర్‌లోను రాశీ నటించనుంది. షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. రాజ్ అండ్ డీకే -ఫర్జీ 2- వెబ్ సిరీస్ లోను రాశీ నటించనుంది. ఇక ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌తో మరొకసారి సోషల్ మీడియా ట్రెండింగ్‌లో నిలిచింది

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662